# పూజలు లేకుండానే గంగమ్మ ఒడికి గణేశుడు

**కుల్కచర్ల, సెప్టంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గణేశుడిని ప్రతిష్టించి పూజలు నిర్వహించాల్సిన సమయంలోనే విగ్రహన్ని నిమజ్జనం చేయాల్సిన పరిస్థితి ఏర్పాడింది. గణేశుడిని ప్రతి సంవత్సరం ప్రతిష్టిచే స్థలంల్లో కాకుండా ప్రస్తుతం భూ వివాదానికి సంబంధించిన కోర్టుకేసులో ఉన్నస్థలంలో గణేశుని మండపం ఏర్పాటు చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో సదరు భూయజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది. పోలీసులు జోక్యం చేసుకుని ఘర్షణ జరగకుండా సద్దుమణిగించారు. ఎట్టి పరిస్తితుల్లో ఇక్కడ గణేశుని ప్రతిష్ఠించవద్దని చెప్పడంద్వారా గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తున్న యువకులు మనస్తాపానికి గురైనట్లు



గంగమ్మ ఒడికి బయలు దేరిన గణేశుడు

తెలిసింది. అయితే అక్కడిభూమి గత కొన్ని సంవత్సరాలుగా సర్వేలుచేయడం ద్వారా మా భూమి ఉంద ని కొందరు, మాకు ఉందని మరి కొందరు అలాగే భూ వివాదం ఏర్పడుతుంది. మొత్తనికి పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నప్పటికి వివాదం కారణంగా ఉత్సవాలను కొనసాగిం



గణేశుని ప్రతిష్ఠించవద్దని అడ్డుకుంటున్న దృశం

చలేని పరిస్థితి ఏర్పడిందని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పూజలు నిర్వహించకుండానే గణేశుడి విగ్రహన్ని గంగమ్మ ఒడికి చేర్చారు. ఏటా భక్తిశ్రద్దలతో గణేశ్ ఉత్సవాలు నిర్వహించే తమకు ఈ పరిస్థితి తీవ్రంగా బాధ కలిగించిదని యువకులు తెలిపారు. భూ వివాదాల కారణంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇబ్బందులు తలెత్తకుండా అధి కారులు తగినచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.







రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# కాలువ కోసం భూమి పోతే.. రైతు బతుకుకు దారేది?



గ్రామసభకు హాజరైన భూ నిర్వాసిత రైతులు..



భూసేకరణ గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అనిత..

**దుద్యాల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణపై దుద్యాల్ మండల రైతుల అభ్యంతరాలు, డిమాండ్లు అధికారుల ముందుకు వచ్చాయి. మంగళవారం హస్నాబాద్ రెవెన్యూ గ్రామ పరిధిలోని హస్నాబాద్, ఆలేడ్ రైతులతో 85 ఎకరాల భూసేకరణపై, దుద్యాల్ రెవెన్యూ గ్రామ పరిధిలోని దుద్యాల్, అల్లీఖాన్‌పల్లి రైతులతో 65 ఎకరాల భూసేకరణపై వేర్వేరు గ్రామసభలు నిర్వహించారు. కాలువకు అవసరమైన దానికంటే అధిక వెడల్పులో భూమి సేకరిస్తున్నారని, దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు భూమితోపాటు జీవనాధారాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

**1500 ఎకరాలు సేకరణ.. 53 వేల ఎకరాలకు సాగునీరు**

ఆర్డీవో కె.అనిత మాట్లాడుతూ దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల్ నాలుగు మండలాల పరిధిలో ఎంఎన్‌కేఎల్ఐ పథకం కోసం సుమారు 1500 ఎకరాల భూసేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తయితే నాలుగు మండలాల పరిధిలో సుమారు 53 వేల ఎకరాల సాగుభూమికి నీరందించే అవకాశం ఉంటుందని వివరించారు.

**ఎకరాకు రూ.20 లక్షల ప్యాకేజీ**

భూసేకరణకు ప్రభుత్వం నిర్ణయించిన ప్యాకేజీ ప్రకారం ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లించేలా జీవో జారీ చేసినట్లు ఆర్డీవో తెలిపారు. కాలువ నిర్మాణంతో ఒక రైతుకు చెందిన భూమి కొంత భాగం మిగిలి సాగుకు పనికిరాని పరిస్థితి ఏర్పడితే, రైతు సమ్మతితో ఆ భూమిని కూడా సేకరించి పరిహారం చెల్లించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

**బోర్లు, తోటలు, నిర్మాణాలకు పరిహారం**

బోరుబావులు, తోటలు, ఇళ్లు, ఇతర నిర్మాణాలకు సంబంధిత శాఖల ద్వారా ప్రత్యేక సర్వే నిర్వహించి నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందిస్తామని ఆర్డీవో వివరించారు. ఒక రైతు పూర్తిగా భూమిని కోల్పోతే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.5 లక్షల ప్రత్యేక పరిహారం అందించే అవకాశం ఉందన్నారు.

**150 అడుగుల భూసేకరణపై రైతుల అభ్యంతరం**

కాలువలో సుమారు 2.8 మీటర్ల నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున ఇరువైపులా రహదారులతో కలిపి సుమారు 90–100 అడుగుల వెడల్పు సరిపోతుందని హస్నాబాద్ రైతు బీరేందర్ పేర్కొన్నారు. 150 అడుగుల వరకు భూమి సేకరిస్తే చిన్న రైతులు తీవ్రంగా నష్టపోతారని, అవసరమైన మేరకే భూమి తీసుకోవాలని కోరారు.

**పైపులైన్ ద్వారా నీటిని తరలించాలి**

మక్తల్, నారాయణపేట్ ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ పైపుల ద్వారా నీటిని తరలిస్తున్న విధానాన్ని దుద్యాల్ మండలంలోనూ అమలు చేయాలని రైతులు సూచించారు. కాలువ నిర్మాణం వల్ల ఒకే సర్వే నంబర్‌లోని భూమి రెండు వైపులా విడిపోయి సాగుకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఎకరాకు రూ.40 లక్షలు ఇవ్వాలి**

ఇతర ప్రాంతాల్లో రహదారులు, అభివృద్ధి పనుల కోసం భూసేకరణలో ఎకరాకు అధిక పరిహారం అందించిన ఉదాహరణలను ప్రస్తావించిన రైతులు, ఎంఎన్‌కేఎల్ఐ పథకంలో ఎకరాకు కనీసం రూ.40 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయమైన పరిహారం అందించినప్పుడే భూసేకరణకు సహకారం లభిస్తుందని స్పష్టం చేశారు.

**కాలువ దాటేందుకు దారులు ఎక్కడ?**

కాలువ నిర్మాణం అనంతరం అవతలి వైపున్న పొలాలకు రైతులు ఎలా వెళ్లాలనే అంశంపై స్పష్టమైన ప్రణాళికను ముందుగానే ప్రకటించాలని రైతులు కోరారు. అవసరమైన చోట్ల వంతెనలు, క్రాసింగ్‌లు, రహదారులు ఏర్పాటు చేయాలని, కేవలం భూమి తీసుకోవడమే కాకుండా సాగుకు అవసరమైన రాకపోకల సౌకర్యాలు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు.

**తహసిల్దార్ కిషన్.. రైతుల సహకారం కోరుతూ**

తహసీల్దార్ కిషన్ మాట్లాడుతూ రైతుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రాజెక్టు భవిష్యత్తులో సాగునీటి అవసరాలను తీర్చే లక్ష  ్యంతో చేపడుతున్నందున భూసేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని కోరారు.

**డీఈ కృష్ణమోహన్.. సాగునీటి ఇబ్బందుల పరిష్కారమే లక్ష్యం**

ఇరిగేషన్ డీఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ఎంఎన్‌కేఎల్ఐ పథకాన్ని చేపడుతోందన్నారు. అయితే కాలువపై నుంచి రైతులు అవతలి వైపు పొలాలకు వెళ్లేందుకు ఎలాంటి మార్గాలు ఏర్పాటు చేస్తారనే అంశంపై రైతులు పలు ప్రశ్నలు లేవనెత్తారు.

**రైతుల సందేహాలపై పూర్తి స్పష్టత కావాలి**

భూసేకరణ వెడల్పు, కాలువ దాటే మార్గాలు, సర్వే నంబర్లు, కాస్తుల వాస్తవ పరిస్థితులు, బోర్లు–తోటలు, మిగిలిపోయే భూముల పరిహారం తదితర అంశాలపై అధికారులు పూర్తి వివరాలతో రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరారు. సర్వే నంబర్ ఒకచోట, వాస్తవ సాగు మరోచోట ఉన్న భూములను ఫీల్డ్ స్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామసభల్లో ఆర్డీవో అనిత, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో జైపాల్‌రెడ్డి, ఉపతహసీల్దార్ శివకుమార్, ఆర్ఐ నవీన్‌కుమార్, జీపీవోలు గోపాల్, పకీరప్పతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీశైలం, సత్యనారాయణ, బాల వెంకటరమణ తదితరులతో సుమారు 100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అక్టోబరు 1వ తేదీ నుంచి ప్రారంభించటానికి తగు ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఖరీఫ్ 2026–27కు సంబంధించి వరిధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు కేంద్రాల వద్ద మౌళిక సదుపాయాలు, తూకం, గన్నీలు, అన్ని ఏర్పాట్లు ముందుగానే చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా సివిల్‌సప్లయి, పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు ఎల్.సుగణబాయి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకళ, ఎండి రియాజ్, ఎస్‌డబ్ల్యుసి మేనేజర్స్, తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి దృశ్యం

## పోచమ్మ ఆలయంలో హుండీ చోరీ

**వికారాబాద్, ప్రభాతవార్త:** పట్టణంలోని లాలాగూడ పోచమ్మ ఆలయంలో అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం అర్ధ రాత్రి సమయంలో ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి, ఆలయంలోని హుండీ, ఇతర వెండి సామాగ్రి ఎత్తుకెళ్లారని స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో ఆలయంలో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దొంగలు ఈ చోరీకి పాల్పడినట్లు స్థానికులు భావిస్తు న్నారు. మంగళవారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు హుండీ కనిపించకపోవడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పోచమ్మ ఆలయం

# పెద్ద చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు



శామీర్‌పేట పెద్ద చెరువును సందర్శించిన మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, పాల్గొన్న డిసిపిలు, ఏసిపిలు, సంబంధిత అధికారులు,ఉత్సవ కమిటీ వారు తదితరుల దృశ్యం



.శామీర్‌పేట పెద్ద చెరువులో వినాయకుల నిమజ్జనం కోసం భారీ ఏర్పాట్లు

**శామీర్‌పేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయకుల నిమజ్జనం కోసం జరుగుతున్న ఏర్పాట్లను మల్కాజ్‌గిరి మున్సిపల్ (కార్పోరేషన్) జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, మల్కాజ్‌గిరి పోలీస్ డిసిపి శ్రీధర్, ట్రాఫిక్ డిసిపి రాహుల్‌రెడ్డిలు సందర్శించి పరిశీలించారు. చెరువు వద్ద జరుగుతున్న ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. మంగళవారం శామీర్‌పేట పెద్ద చెరువును వారు సందర్శించి వినాయకుల నిమజ్జనం కోసం జరుగుతున్న ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ పేర్కొంటూ శామీర్‌పేట పెద్ద చెరువులో నీరు అధికంగా ఉన్నందున ఈ సారి ఇతర చెరువుల్లో తక్కువగా నీరు ఉన్నందున పలు ప్రాంతాల నుంచి వినాయకులను నిమజ్జనం చేయటానికి శామీర్‌పేట పెద్ద చెరువుకు భారీ ఎత్తున భక్తులు వినాయక విగ్రహాలతో ఊరేగింపుగా వచ్చే అవకాశం ఉంటుందని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఉండి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగ సజావుగా జరిగేలా అన్ని రకాలుగ పకడ్బంధీగ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వినాయకుల నిమజ్జనం కోసం చెరువు ప్రాంగణంలో క్రేన్‌ల ఏర్పాటు కోసం వేధికకు స్థలం చదును పనులు చేపట్టారు. చెరువు ప్రాంగణంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా బారికేడ్స్ ఏర్పాటు చేశారు. చెరువు ప్రాంగణంలో రోడ్లు ఏర్పాటు చేశారు. వినాయకుల నిమజ్జనాల కోసం వచ్చే వాహనాల రాకపోకల కోసం వేరువేరుగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా చూడాలని, శామీర్‌పేట పెద్ద చెరువు ప్రాంగణంలో, చెరువు పక్కనే రాజీవ్‌రహదారి ఉన్నందున ట్రాఫిక్ పోలీసు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పెద్ద చెరువు వద్ద ఇప్పటికే నిమజ్జనం కోసం ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయి. విద్యుత్ దీపాలు, బారికేడ్స్ ఏర్పాటు చేశారు. అదే విధంగా క్రేన్‌లను చెరువు వద్ద పెట్టటానికి కూడ సిద్ధం చేస్తున్నారు. చెరువు ప్రాంగణంకు అధికంగా వాహనాలు, భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎవరికి ఇబ్బందులు కలుగకుండ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వంతో ఉంటూ వినాయకుల నిమజ్జనం ప్రశాంతంగ నిర్వహించటానికి అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. ఇదీ ఇలా ఉండగ శామీర్‌పేట పెద్ద చెరువుకు మాత్రం ముందుగానే వినాయక ఉత్సవాలు ప్రారంభించిన మూడవ రోజు నుంచే వినాయకులను నిమజ్జనం చేయటానికి చెరువుకు భక్తులు వినాయకులతో రావటం జరుగుతుంది. ఈ పెద్ద చెరువులో ప్రతి ఏటా మూడవ రోజు నుంచే వినాయకుల నిమజ్జన కార్యక్రమాలు సాదారణంగ ప్రారంభం అవుతాయి. మూడవరోజు నుంచే వినాయకులను నిమజ్జనం చేయటానికి వస్తూ ఉంటారు. ఇక ఐదవ, ఏడవ, తొమ్మిదవ రోజులలోనూ భాగానే వినాయకులను నిమజ్జనం కోసం ఊరేగింపుగా వచ్చి నిమజ్జనం చేయటం జరుగుతుంది. ఇక పదకొండవ రోజు చివరి రోజు (జిహెచ్ఎంసి, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని) నగరంలో జరిగే వినాయకుల నిమజ్జనం రోజున మాత్రం శామీర్‌పేట పెద్ద చెరువుకు భారీ సంఖ్యలో వినాయకుల నిమజ్జనం చేయటం, భారీ సంఖ్యలోనే భక్తులు కూడ విచ్చేయటం జరుగుతుంది. శామీర్‌పేట పెద్ద చెరువును వారితో పాటు జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డి, జవహర్‌నగర్ పోలీస్ ఏసిపి చక్రపాణి, తిరుమలగిరి ట్రాఫిక్ ఏసిపి శంకర్‌రాజు, శామీర్‌పేట పోలీస్ సిఐ కె.నర్సింహ్మారెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ జానకిరామ్, పలువురు ఎస్ఐలు, కీసర సర్కిల్ (మున్సిపల్) డిప్యూటీ కమిషనర్ రామలింగం, ఉత్సవకమిటీ వారు రవిగౌడ్, శ్రీనివాస్, మరికొందరు, పలువురు సంబంధిత శాఖల అధికారులు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఈవీఓం గోడౌన్ ను పరిశీలిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

## ఇవిఎం గోడౌన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**వికారాబాద్, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ వెంకటాచారిలు సోమవారం సందర్శించి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తో పాటు డి ఆర్ఓ స్వర్ణలత, తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ అలీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## తాండూరులో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

..స్పీకర్‌తో పాటు ప్రముఖులు హాజరు కావాలని ప్రతినిధుల ఆహ్వానం

**పెద్దేముల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ఈ నెల 17న తాండూరులో విశ్వకర్మ జయంతి ఉత్సవాలకు తెలంగాణ శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో పాటు మాజీ స్పీకర్ మధుసూదన్‌చారీ, చెవెళ్ళ యంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసన మండలి చీఫ్‌విఫ్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎంఎల్‌సి దాసోజు శ్రవన్ తదితరులు హజరు కావాలని తాండూరు నియోజకవర్గ విశ్వకర్మ సంఘం ప్రతినిధులు వారిని ఆహ్వానించారు. ప్రముఖులను ఆహ్వానించిన వారిలో శేఖర్ మా సంఘం గౌరవం అధ్యక్షులు కరణం పురుషోత్తంరావు, సంఘం ప్రతినిధులు పులిందర్‌చారీ, గద్దె శ్రీనివాస్ చారీ, రవిందర్‌చారీ, కందనెల్లి శ్రీనివాస్‌చారీ తదితరులు ఉన్నారు.



విశ్వకర్మ జయంతికి హాజరుకావాలని స్పీకర్‌ను ఆహ్వానిస్తున్న ప్రతినిధులు

## ఇజెహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటరు తనిఖీ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లిలోని ఉద్యోగుల, జర్నలిస్టుల ఆరోగ్య పథకం (ఈజెహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్‌ను మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.ఆనంద్ సందర్శించి తనిఖీలు చేశారు. మంగళవారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఈజెహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన తనిఖీ చేసి సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, స్టాక్ రిజిష్టర్లు, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు అవుతున్న రోగుల హాజరు వివరాలు, అందిస్తున్న వైద్య సేవలు, రిఫరల్ కేసుల వివరాలను డాక్టర్ ఆనంద్ పరిశీలిచారు. రోగులకు అందుతున్న సేవలు, నమోదు ప్రక్రియ సక్రమంగా జరుగుతుందా అనే అంశాలను తనిఖీలు చేశారు. దంత వైద్య సేవలు అందుతున్నా యా అని ఆరాతీశారు. రోగులకు అవసరమైన పరీక్షలు వైద్య సేవలు నిరంతరాయంగ అందేలా చూడాలన్నారు. ఉద్యో గులకు , జర్నలిస్టులకు ఆరోగ్య పథకం ద్వారా అందించే సేవల్లో ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఈజెహెచ్ఎస్‌లోని ఒపి, ఐపి, అత్యవసర వైద్య సేవల పూర్తి ప్రక్రియను డాక్టర్ ఆనంద్ సమీక్షించారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవరించాలని ఉద్యోగులకు, జర్నలిస్టులకు ఆరోగ్య సేవలు అందించేలా చూడాలని, నిర్లక్ష్యం చేయకూడదని డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.ఆనంద్ ఆదేశించారు.



## దౌల్తాబాద్ మండలంలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

-594 బస్తాల పీడీఎస్ బియ్యం,3 వాహనాలు సీజ్

**దౌల్తాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్(రేషన్) బియ్యంపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి పెద్దఎత్తున బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో నిర్వహించిన ఈ దాడుల్లో, మొత్తం 594 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న 3 వాహనాలను పట్టుకున్నట్లు సివిల్ సప్లై డీటీ గణపతిరావు తెలిపారు. మంగళవారంరోజు డీటీ గణపతిరావు, ఎస్సై కే.వేణుకుమార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసులు, అధికారులు హెచ్చరించారు.



రేషన్ బియ్యాన్ని, వాహనాలను స్వాధీనంచేసుకున్న పోలీసులు

## తండాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి..

**దుద్యాల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలంలోని పలు తండాల్లో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మైసమ్మగడ్డతండా, రోటిబండతండా, గడ్డమీదితండా తదితర గిరిజన ప్రాంతాల్లో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుక్కెడు నీటి కోసం మహిళలు, పిల్లలు కిలోమీటర్ల మేర నడవా ల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.



తాగునీటి కోసం బిందెలతో వెళ్తున్న తండావాసులు

## పట్టభూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పనులను ఆపండి

**మోమిన్‌పేట్, సెప్టెంబరు 15. ప్రభాతవార్త:** మా స్వంత పట్టా భూమిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాన్ని నిలిపివేయుటకు చర్యలు తీసుకోవలని మంగలి నాగేష్ తండ్రి లక్ష్మయ్య మంగళవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ సృజన సాహిత్య కు వినతి పత్రం సమర్పించారు. భూ యజమానులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలమేరకు మోమిన్‌పేట్ మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన మంగలి నాగేష్ కు పట్టా భూమి సర్వే నంబర్ 438/ అ2/4/1/1/1/1/1/1, విస్తీర్ణం 0.1513, గల పట్టా భూమిలో బేగరి మల్లమ్మ భర్త మల్లయ్య అనే వ్యక్తి అక్రమంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పనులు నిర్వహిస్తున్నారని, నా పేరున ఉన్న పట్టా భూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం విషయమై ఇదివరకే మోమిన్‌పేట్ మండల గ్రామ కార్యదర్శి (జీపీఓ) ఎంపిడిఓ, తహశీల్దార్ మరియు జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు/పిర్యాదు సమర్పించడం జరిగిం దని అన్నారు. అయినా ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎటువంటి తగిన చర్యలు తీసుకోలేదు. కనుకా మళ్లీ ఇంకో సారి అధికారుల దృష్టికి తేవాలని మళ్లీ వినతి పత్రం సమర్పిస్తున్నానని తెలిపారు. . అందువల్ల ఇందిరమ్మ ఇల్లు బిల్ కూడా అప్రూవ్ రావడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి అర్హతను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైన స్థల పరిశీలన/ ధృవీకరణ చేసి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు నిర్మాణం నిలిపివేసి సదరు భూమి యాజమాన్య హక్కులు మరియు హద్దులకు సంబంధించి నాకు అభ్యంతరం ఉన్నందున, సంబంధిత రికార్డులు, పట్టా పాస్‌బుక్, ధరణి/భూ భారతి రికార్డులు మరియు భూమి హద్దులను పరిశీలించకుండా నిర్మాణం కొనసాగించడం వల్ల భవిష్యత్తులో వివాదం ఏర్పడే అవకాశం ఉంది. కావున, సదరు స్థలాన్ని అధికారులు స్వయంగా పరిశీలించి, భూ యాజమాన్య హక్కులు మరియు రికార్డులను పూర్తిగా నిర్ధారించేవరకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



సమర్పించిన వినతిపత్రం

## చౌరస్తా విస్తరణ ..నాలుగు రోజుల హడావిడి తర్వాత అంతా గప్‌చుప్!

**షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలో చౌరస్తా విస్తరణ పేరుతో నాలుగు రోజుల పాటు హడావిడి చేసి, రోడ్డు ఇరువైపులా ఉన్న చిన్నచిన్న షాపులు, షెడ్లను తొలగించిన అనంతరం పనులను నిలిపివేయడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోందని సీపీఎం షాద్‌నగర్ పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ అన్నారు. చిన్న షాపులు, షెడ్లు తొలగించిన తర్వాత అసలు ప్రధాన రహదారి, ముఖ్య కూడలి విస్తరణ పనులను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ఆయన ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ, చౌరస్తా అభివృద్ధి పేరుతో అధికారులు, ప్రజాప్రతినిధులు హడావిడి చేయడం తప్ప క్షేత్రస్థాయిలో మాత్రం పనుల్లో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. చౌరస్తా విస్తరణ కోసం మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో తీర్మానాలు, బడ్జెట్ తీర్మానాలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు ఎందుకు ముందుకు సాగడం లేదో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అత్యంత కీలకమైన రోడ్డు విస్తరణ విషయంలో నిర్లక్ష  ్యం ఎందుకు జరుగుతుందో అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష  ్యం వహిస్తున్నారనే విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని శ్రీను నాయక్ పేర్కొన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి, ప్రమాదాలకు కారణమవుతున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి, చౌరస్తా అభివృద్ధిని పూర్తి చేయడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ కోరారు.

## కాళోజీ స్ఫూర్తితో ప్రశ్నించు.. పోరాడు.. సాధించు

**షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** కాళోజీ నారాయణరావు స్ఫూర్తితో కవులు, కళాకారులు ప్రజా సమస్యలపై తమ కలంతో ప్రశ్నిస్తూ, అన్యాయాలు, అక్రమాలను ఎదిరిస్తూ సామాజిక చైతన్యానికి కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం షాద్‌నగర్ రైల్వే స్టేషన్ రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 'సాహితీ కళాభారతి ఆధ్వర్యంలో కాళోజీ జయంతి సందర్భంగా నిర్వహించిన కవిసమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాబంధు బండారి రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు కవిత్వం తెలంగాణ అస్తిత్వాన్ని, రాజకీయ, సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబించిందన్నారు. తెలంగాణ ఉద్యమానికి తన రచనలు, గళం ద్వారా కాళోజీ నూతన స్ఫూర్తిని అందించారని పేర్కొన్నారు. సమాజంలో కవుల స్థానం ఎంతో ప్రత్యేకమైనదని, అన్యాయాలు, అక్రమాలను కలంతో ఎదిరించే గుండెధైర్యం కవులకు ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో కవులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.

## 50 ఏళ్ల విమలక్క ప్రస్థానానికి ప్రజా కళాజాతర

**షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ఈనెల 26 నుంచి 28 వరకు జరగనున్న 50 ఏళ్ల విమలక్క కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 50 గంటల ప్రజా కళా జాతరకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిని విమలక్క ఆహ్వానించారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆటపాటలు, ప్రజా కళారూపాలతో కళా ప్రదర్శనలు కొనసాగనున్నాయి. ఐదు దశాబ్దాలుగా ప్రజా కళారంగంలో విమలక్క సాగిస్తున్న ప్రస్థానాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ మహా కళా జాతరలో ప్రజలు, కళాకారులు, అభిమానులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు భాగస్వాములు కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. ప్రజా సమస్యలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన విమలక్క ఐదు దశాబ్దాల కళా ప్రయాణాన్ని ఘనంగా చాటిచెప్పేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

## బేకరీపై ఎస్ఒటి పోలీసుల దాడి..పదార్థాల సీజ్

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** బేకరీపై ఉప్పల్ ఎస్ఓటీ పోలీసులు దాడిచేసి గడువు ముగిసిన పదార్థాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఘట్‌కేసర్ మెయిన్‌రోడ్డులో ఉన్న ప్రిన్స్ బేకరీ లో మంగళవారం ఎస్ఓటీ బృందం తనిఖీలు నిర్వహించింది. దాడి సమయంలో బేకరీలో ఉత్పత్తుల తయారీలో గడువు ముగిసిన ఆహార రంగులు, గడువు ముగిసిన ఆహారపదార్థాలను వినియోగిస్తున్నారని, బేకరీలోపల పరిసరాలను అపరిశుభ్రంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఆహార కల్తీ, ఆహార భద్రతా ఉల్లంఘనల నేపథ్యంలో ఇద్దరు నిర్వహకులను అదుపులోకి తీసుకు న్నారు. ఘట్‌కేసర్‌కు చెందిన సూపర్‌వైజర్ షేక్ నజీర్‌బాషా (22), బేకరీ యాజమాని షేక్ అక్బర్ (35)లను అదుపులోకి తీసుకొని ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగిం చారు. గడువు ముగిసిన బుష్ సింథటిక్ ఫుడ్ కలర్ 1 బాటిల్, కేక్‌స్ప్రే రెయిన్‌బో 11 బాటిల్స్, బుష్ రెడ్ కలర్ 1 బాక్స్, గడువు ముగిసిన హాట్ చిల్లి 30 ప్యాకెట్లు, గడువు ముగిసిన గ్లోబ్ ఐసింగ్ సుగర్ 1 కిలో ప్యాకెట్, గడువు ముగిసిన క్రస్ట్ క్రంబ్ మఫిన్ మిక్స్ పొడి 1 ఐదు కిలోల ప్యాకెట్, గడువు ముగిసిన హిందుస్థాన్ కొకొనట్ ఫ్లేక్స్ 5 కిలో ప్యాకెట్లు, గడువు ముగిసిన 10 ట్రేల గుడ్లు, త్రిశూల్ సింథటిక్ ఫుడ్ కలర్ 12 బాటిల్స్, ఎగ్ పఫ్స్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, గడువు ముగిసిన బ్రెడ్, వనస్పతి, కలర్‌మిస్ట్ 4, అరకిలో బరువున్న కేకులు 5, కిలో బరువున్న 5 కేకులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిర్వహకులతో పాటు సీజ్ చేసిన పదార్థాలను ఘట్‌కేసర్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు.



## కేశంపేటలో అండర్14, అండర్17 స్కూల్ గేమ్స్ పోటీలు

**-కబడ్డీ, కోకో, వాలీబాల్, డిస్కస్ త్రో, షాట్‌పుట్, అథ్లెటిక్స్ పోటీలు**

**కేశంపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** కేశంపేట మండల స్థాయి అండర్14, అండర్17 విద్యార్థుల క్రీడా పోటీలను ఈ నెల 16, 17, 18 తేదీల్లో కేశంపేట మండల కేంద్రంలోని ఎడ్యూకోజ్ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎం చంద్ర శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ పోటీల్లో కేశంపేట మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని మండల కోరారు. కబడ్డీ, కోకో, వాలీబాల్‌తో పాటు డిస్కస్ త్రో, షాట్‌పుట్, అథ్లెటిక్స్ తదితర క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచే విద్యార్థులకు తదుపరి జోనల్ స్థాయి, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని వారి వారి ప్రతిభను నిరూపించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఈ అవకాశాన్ని మండల పరిధిలోని క్రీడాకారులు సద్వినియోగించుకోవాలని కేశంపేమండల విద్యాధికారి ఎం చంద్రశేఖర్ తెలిపారు.

## నిరుపేదలకు గొప్పవరం ముఖ్యమంత్రి సహాయ నిధి

**కేశంపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని పిఏసిఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రానికి చెందిన మున్ననూరు బాలరాజు గుప్త కుటుంబానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా సోమవారం 3 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి ప్రొసీడింగ్ అందజేశారు. గత 15 రోజుల క్రితం బాలరాజు గుండె సమస్య బాధతో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు అత్యవసర చికిత్స నిమిత్తం బాలరాజుకు గుండె ఆపరేషన్ నిర్వహించారు. ఆర్థిక స్తోమత లేని బాలరాజు కుటుంబం ఆర్థిక సహాయం కోసం కేశంపేట స్థానిక కాంగ్రెస్ నాయకుల సహకారంతో ఎమ్మెల్యేను కలవగా ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 3,50,000/ మంజూరు చేయించారు. బాలరాజు వైద్యానికి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో ఆర్థిక సహాయం అందింది. ఎల్ఓసి అందుకున్న బాలరాజు కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మండల పార్టీ అధ్యక్షుడు అనుమాగళ్ల రమేష్, పిఏసిఎస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, నాయకులు గుండ్రాతి రమణ గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సిఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

## అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టండి



డిప్యూటీ తహసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

**కేశంపేట, సెప్టెంబరు 15 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని పుట్టవానిగూడ గ్రామ శివారులోని సర్వే నంబర్ 206లో ఉన్న ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, వాటిని వెంటనే నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థులు కేశంపేట డిప్యూటీ తహసీల్దార్ గీతకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 206లో సుమారు 8 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమి ఉందని, అందులో మట్టిని తవ్వి విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. ఈ భూమిలో ఇప్పటికే ప్రకృతి వనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిని ఇతర అవసరాలకు వినియోగించకుండా, భూమిని పరిరక్షి ంచాలని గ్రామస్థులు డిప్యూటీ తహసీల్దార్‌ను కోరారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని మట్టి తవ్వకాలను నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జరుపుల రాజు నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ కేశంపేట మండల అధ్యక్షులు జంగా శేఖర్, మాజీ వార్డు సభ్యులు పట్నం కుమార్, టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజు యాదవ్, పట్నం రాజు, కాసారం శ్రీశైలం, పెద్దని ప్రభాకర్ యాదవ్, అంజి యాదవ్, వేముల శివానంద్, తదితరులు పాల్గొన్నారు.

## గురువుల సేవలకు ఘన సత్కారం

**-శంషాబాద్‌లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం**

**శంషాబాద్ సెప్టెంబరు 15,ప్రభాతవార్త :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శంషాబాద్ మండల పరిధిలో విద్యార్థుల అభ్యున్నతికి విశేష సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మండల విద్యాశాఖ, మండల వనరుల కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు-2026 ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. ఈ



ఉత్తమ ఉపాధ్యాయలను సన్మానించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,మండల విద్యాశాఖ అధికారులు

సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భావి భారతపౌరులను తీర్చిదిద్దంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధనే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్పుతున్న గురువుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాంకి గ్రామంలో దారుణం
## గొంతు కోసి వ్యక్తిని హత్య చేసిన దుండగులు

**దౌల్తాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం యాంకి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తి గొంతు కోసి హత్య చేసిన సంఘటన ఆదివారంరోజు రాత్రి చోటుచేసుకోగా, సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మృతుడు బోడి బుజ్జప్ప(48)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ఆయన కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ యాంకి గ్రామంలోనే రోజువారీ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం రోజు రాత్రి సమయంలో బోడి బుజ్జప్పను గుర్తు తెలియని దుండగులు గొంతు కోసి అత్యంత క్రూరంగా హత్య చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో బుజ్జప్ప అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్, కొడంగల్ సీఐ డి.చంద్రశేఖర్‌రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలను సేకరించారు. మృతుని కుమారుడు బోడి మాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. హత్యకు వ్యక్తిగత కక్షలు కారణమా లేక ఇతర ఏమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన నిందులను త్వరలోనే పట్టుకొని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించేది లేదు

**మాడ్గుల, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త :** మండలంలోని పలు శాఖల అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష ్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్య లను తెలుసుకుని వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వ హించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. మండలంలోని వివిధ శాఖల పనితీరు, ప్రభు త్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల పనితీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులను నిలదీశారు. ప్రత్యేకంగా ఉపా ధిహామీ పథకం, విద్యుత్, ఉద్యానవన, వ్యవసాయ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖలతో పాటు పంచా యతీ కార్యదర్శుల పనితీరుపై ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో ఎందుకు అందడంలేదని అధికారులను అడిగి తెలుసు కున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఉన్నప్పటికీ వాటి పరిష్కారంలో జాప్యం చేయడంపై ఆయన తీవ్ర అసహ నం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ అధికారులు కార్యాలయా లకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా





సమావేశం మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసిన ప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో జాప్యం, నిర్లక్ష ్యం కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలపై అవగాహన కల్పించి, వారికి ప్రయోజనాలు అందేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు.

**పలు శాఖల పనితీరుపై ప్రశ్నలు...**

ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించడం, పెండింగ్ పనులను పూర్తి చేయడం వంటి అంశాలపై ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందాల్సిన సేవలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే విషయంపై ఆరా తీశారు. రైతులకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు, ఉద్యానవన పంటలకు సంబంధించిన సమస్యలను ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల వార్డెన్ల పనితీరు, సంక్షేమ పథకాల అమలుపైనా చర్చ జరిగింది.

**పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై అసంతృప్తి....**

గ్రామాల్లో పారిశుద్ధం, అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకుండా మండల స్థాయికి వస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా వాటి ఫలాలు ప్రజలకు అందేలా చూడాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం లేకుండా అధికారులు వ్యవహరించడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదని సూచించారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేసి మాడ్గుల మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశించారు.





మాట్లాడుతున్న కేవస్ రత్నం

## నేను సైతం సేవలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**పెద్దేముల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడి జన్మదినం సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి నేను సైతం సేవలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కేవస్ రత్నం పిలుపునిచ్చారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కేవస్ రత్నం మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి గత 25సంవత్సరాలుగా అందిస్తున్న అంకిత భావంతో కూడిన ప్రజాసేవకు కృతజ్ఞతగా, సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు సేవా సంకల్ప అభియాన్- నేను సైతం సేవలో పేరిట 25 రకాల ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అన్నారు. బిజేపి జిల్లా అధ్యక్షులు యు.రమేష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో వచ్చేది బిజేపి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వపరంగా అధికారికంగా ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. 25 ఏళ్ళ ప్రధాని నిరంతర సేవకు గుర్తుగా రూపొందించిన ఈ 25 సేవా కార్యక్రమాల్లో ప్రతిఒక్కరు ఏదో ఒక దానిని ఎంచుకొని సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా మాజీ అధ్యక్షులు మాధవరెడ్డి, జిల్లా సేవా సంకల్ప కన్వీనర్ వివేకనందారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు శ్రీశైలం, పటేల్ విజయ్, బంటారం భద్రేశ్వర్, నాగారం మల్లేశం, బొప్పి శ్రీహరి, రమేష్ సాగర్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ దీపక్ తివారి సుడిగాలి పర్యటన

**కొడంగల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. కొడంగల్ మండల పరిధిలోని ధర్మాపూర్ గ్రామానికి సంభందించి తాగునీటి సమస్యను కలెక్టర్ పరిశీలించారు. గ్రామస్దులు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను అడిగి తెలుసు కున్నారు. గ్రామ సమీపంలోని చెరువుకుంటలో ఉన్న బోర్‌ను వినియోగించి గ్రామానికి తాగునీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, సంభందిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బోర్ నుంచి నీటిని గ్రామానికి సక్రమంగా సరఫరా చేసేలా అవసరమైన ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి కొరత లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం రైతులు తమ పొలాలకు వెళ్ళడానికి ఇబ్బందిగా ఉన్నందున నక్షబాట రోడ్డు వేయించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఓ జయసుధ, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, తహశీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ ఉషశ్రీ, సర్పంచ్ సౌభాగ్యలక్ష్మీ ఉన్నారు.

**అంగడిరైచూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ :**



పిహెచ్‌సీ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

అంగడిరైచూర్ ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో హాజరు పట్టిన రిజిస్ట్రర్, స్టాక్ రిజిస్ట్రర్‌తో పాటు మందులు, ఇతర వైద్య సామాగ్రి నిల్వలను పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సంభందిత అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలో



ధర్మాపూర్‌లో తాగునీటి సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

చికిత్స పొందుతున్న రోగులను కలెక్టర్ పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్దితి, అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యంమందులు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో సరిపడా వైద్య సిబ్బంది లేనందున వైద్యం సక్రమంగా అందడం లేదని గ్రామస్దులు తెలిపారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డిఎంఅండ్‌హెచ్‌ఓకు ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి సందర్శనలో మెడికల్ ఆఫీసర్ బుష్రాబేతం, డిపిఓ జయసుధ, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, తహశీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ ఉషశ్రీ, సర్పంచ్ సౌభాగ్యలోక్ష్మ, పంచాయత సెక్రటరీ కృష్ణవేనీ తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీపల్లిలో ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ :**

మండలంలోని లక్ష్మీపల్లి గ్రామంలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాకు సంభందించిన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఇప్పటివరకూ జారీ చేసిన నోటీసులు, ఇంకా జారీ చేయాల్సిన నోటీసుల వివరాలను కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు ఏయే ఓటర్లకు జారీ చేశారు. ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి. జారీ చేసిన నోటీసులపై తదుపరి చేపట్టాల్సిన చర్యలు ఏమిటనే అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి వివరాన్ని నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జారీ చేసిన నోటీసుల వివరాలను సక్రమంగా నమోదు చేసి, పెండింగ్‌లో ఉన్న నోటీసులను నిబంధనల ప్రకారం త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిపిఓ జయసుధ, తహశీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ ఉషశ్రీ, పంచాయతీ సెక్రటరీ నక్షత్ర, సర్పంచ్ లక్ష్మమ్మ, సంభందిత అధికారులు పాల్గొన్నారు.

**అంగడిరైచూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనఖీ :**

మండలంలోని అంగడిరైచూర్‌లో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి నిర్మాణంలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనికీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్దుల హాజరు, బోధన విధానం, మౌలిక వసతులు, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు., విద్యార్దులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠ్యాం శాలపై అవగాహనను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్దులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల హాజరు, వారికి అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య సంబంధిత వివరాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంభందిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలల సందర్శనలో కలెక్టర్ వెంట డీఈఓ, డిపిఓ, తహశీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలతో పాటు సంభందిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డిసిఎం ఢీకొని మహిళ మృతి

**శంషాబాద్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త :** ఎన్‌హెచ్44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త, కుమార్తెకు గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో సిద్ధాంతి రైల్వే గేట్ ఎదురుగా చోటుచేసుకుంది. సిఐ సంజీవ్ వివరాల ప్రకారం...అరాంఘర్ నుంచి షాద్‌నగర్ వైపు శ్యామ్‌సుందర్ తన భార్య బి.సోనీ, 11 ఏళ్ల కుమార్తె కాటం శాన్వీతో కలిసి యూనికార్న్ బైక్ (టిజి31ఎ4095)పై వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఎయిచర్ డీసీఎం (కెఎ36సి1249) బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న సోనీ రోడ్డుపై పడిపోగా, డీసీఎం ఆమెపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. శ్యామ్‌సుందర్, ఆయన కుమార్తె కూడా కిందపడటంతో గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే డీసీఎంను నిలిపివేశారు. డ్రైవర్ బసవరాజ్ (రాయచూర్ జిల్లా, కర్ణాటక)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి..

**దుద్యాల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** దుద్యాల్ మండల కేంద్రానికి చెందిన జింక బాలరాజ్ (36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తల వెనుక భాగంలో బలమైన గాయాలు ఉండటం తో హత్య జరిగి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీశైలం, కొడంగల్ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్యలక్ష్మి తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**బహిరంగ ప్రకటన**

మా క్లయింట్ శ్రీమతి గిరి అలియాస్ సనం వెంకట ఉమాదేవి యాదవ్ భర్త: ఎస్.వి. సచీంద్రనాథ్ తరపున ప్రజలకు తెలియజేయునది ఏమనగా, వికారాబాద్ జిల్లా, మోమిన్‌పేట్ మండలం, కేసారం గ్రామంలో ఉన్న ఈ క్రింది వ్యవసాయ భూములు, **O.S. నం. 303/2025** సివిల్ దావాలో పేర్కొన్న 'షెడ్యూల్ ఆస్తులు' A నుండి H వరకు. ఇవి మా క్లయింట్ వాది మరియు సదరు దావాలోని ప్రతివాదులు 1 నుండి 4 వరకు ఉన్నవారికి వారసత్వంగా సంక్రమించిన ఆస్తులు. సర్వే నం 18 విస్తీర్ణం: ఎ.2-09 గుం. సర్వే నం 45 ఎ.6-32 గుం, సర్వే నం 46 1-00 గుం, సర్వే నం 56 ఎ.3-00 గుం, సర్వే నం 63 ఎ.0-30 గుం, సర్వే నం 65 ఎ.0-18 గుం, సర్వే నం 71 ఎ.2-17 గుం.లు మరియు సర్వే నం 238 ఎ.0-24 గుం.ములలో ఉన్న ఈ వ్యవసాయ భూమలన్నింటికీ మా క్లయింట్ మరియు ప్రతివాదులు 1 నుండి 4 వరకు ఉన్నవారు సంయుక్త యజమానులు మరియు స్వాధీనదారులుగా ఉన్నారు.

వంశ కర్త మరియు మా క్లయింట్ వాది యొక్క తాతగారు అయిన దివంగత శ్రీ గిరి ఎల్లారెడ్డి, మా క్లయింట్ మరియు ప్రతివాదులు 1 నుండి 4 వరకు ఉన్నవారికి తండ్రి అయిన దివంగత శ్రీ గిరి వీరారెడ్డి అలియాస్ వీరన్నకు తండ్రి అవుతారు. ప్రతివాదులు: శ్రీమతి ఆకుల భాగ్యలక్ష్మి భర్త: దివంగత గణ ప్రకాష్, తండ్రి: దివంగత గిరి వీరారెడ్డి అలియాస్ వీరన్న D-1, శ్రీమతి బోటె స్వరూప రాణి భర్త: దివంగత బోటె ఫోసెట్టి, తండ్రి: దివంగత గిరి వీరారెడ్డి అలియాస్ వీరన్న D-2, శ్రీమతి కోక విజయలక్ష్మి యాదవ్ భర్త: కోక భద్రయ్య, తండ్రి: దివంగత. పైన పేర్కొన్న దావాలో D-3, గిరి వీరా రెడ్డి ఏ వీరన్న D-4గా ఉన్న గిరి ఆనందం దివంగత గిరి వీరా రెడ్డి కుమారుడు మరియు వీరితో పాటు మరో ఇద్దరు కొనుగోలుదారులు అంటే శ్రీమతి గాజులపల్లి సౌమ్య రెడ్డి తండ్రి: జి. సుబ్బారెడ్డి, వయస్సు: సుమారు 43 ఏళ్లు, చిరునామా: H.No: 39/359-2-2, వివేకానంద నగర్, ఓంశాంతి నగర్, కడప, A.P. 516001 - ఈమె D-5; మరియు M/s LUSH SPACE LLP (CIN/FIRM/ TRUST No: ABC: 4663, ప్రతినిధి: మహేశ్వరం వివేక్, చిరునామా: C-5, లేక్ హౌస్, కావూరి హిల్స్, జూబ్లీహిల్స్, దుర్గం చెరువు బ్యాక్ గేట్, షేక్‌పేట్, హైదరాబాద్-500033 - 6వ ప్రతివాది. వీరందరూ వికారాబాద్ జిల్లాలోని గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో దాఖలైన OS NO. 303 OF 2025 అనే దావాలో ప్రతివాదులుగా ఉన్నారు.

మా క్లయింట్ తరపున మేము తెలియజేసేది మరియు హెచ్చరించేది ఏమిటంటే, పైన పేర్కొన్న ఆస్తులకు సంబంధించిన ఆస్తి విభజన దావా పెండింగ్‌లో ఉన్నందున, ఆ ఆస్తుల విషయంలో వ్యవహరించడానికి మా క్లయింట్ సోదరుడు శ్రీ గిరి ఆనందం తండ్రి: దివంగత గిరి వీరా రెడ్డి - D-4, లేదా అతని కుమారులు లేదా మరెవరికీ ఎటువంటి ప్రత్యేక హక్కు లేదు. వికారాబాద్ జిల్లా, వికారాబాద్‌లోని గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో దాఖలైన OS నం. 303/2025 దావాలో ప్రతివాదులుగా ఉన్న శ్రీ గిరి ఆనందం (D-4), శ్రీమతి గాజులపల్లి సౌమ్య రెడ్డి (D-5) మరియు M/s LUSH SPACE LLP (ప్రతినిధి: మహేశ్వరం వివేక్ - 6వ ప్రతివాది) లతో పైన పేర్కొన్న ఆస్తులకు సంబంధించి ఎవరైనా అమ్మకపు ఒప్పందాలు మొదలైనవి కుదుర్చుకుంటే, వారు తమ సొంత రిస్క్, ఖర్చు మరియు పరిణామాలకు బాధ్యులవుతారు; అటువంటి అమ్మకపు లావాదేవీలకు మా క్లయింట్ కట్టుబడి ఉండరు. ఈ విషయాన్ని గమనించగలరు..

**M/s M. గిరి**
**న్యాయవాదులు**
# 3-6-203/2, మఖ్దూమ్ భవన్ పక్కన,
వీధి నం. 15, హిమాయత్ నగర్,
హైదరాబాద్-29.
మొబైల్: 9885779351

# వినాయకా జర చూడు షాద్‌నగర్

**షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** వినాయక చవితి పర్వదినం సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో రోడ్డు విస్తరణ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రజల భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చేపట్టిన కూడలి విస్తరణ పనులు ముందుకు సాగకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో రోడ్డు విస్తరణ కోసం ఉద్యమిస్తున్న ఆర్ఎన్ రాము వినాయకుడి మాస్క్ ధరించి రోడ్డుపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం అందరి దృష్టిని ఆకర్షించింది. గతంలో పట్టణ కూడలిలో తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు రహదారి విస్తరణ అవసరమని అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగా సుమారు రెండు నెలల క్రితం పరిగి రోడ్డులోని పోచమ్మ ఆలయం సమీపం నుంచి ఆక్రమణల తొలగింపు ప్రక్రియను ప్రారంభించారు. పాత జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న రోడ్డు పక్క దుకాణాలు, చిన్న హోటళ్లు, పండ్ల దుకాణాలు, టీ కొట్టులు, పాన్ దుకాణాలు, జొన్న రొట్టెలు విక్రయించే చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించారు. పట్టణ అభివృద్ధి, రోడ్డు భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమం కావడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదురైనా సహకరించారు. అయితే తమ జీవనోపాధికి ఆధారమైన చిన్న చిన్న దుకాణాలను తొలగించిన అనంతరం, పెద్ద వ్యాపార సంస్థల విషయంలో మాత్రం చర్యలు ముందుకు సాగకపోవడంపై చిరు వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**మార్కింగ్ ఇచ్చి.. రెండు నెలలుగా మోనమేనా?**

పెద్ద వ్యాపార సంస్థల వద్ద కూడా విస్తరణకు అవసరమైన మేరకు మార్కింగ్ ఇచ్చి, నిర్మాణ సామగ్రిని తొలగించుకుని సిద్ధంగా ఉండాలని సూచించినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే దాదాపు రెండు నెలలు గడుస్తున్నా అక్కడ తొలగింపు చర్యలు కనిపించకపోవడంతో రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. చిరు వ్యాపారుల దుకాణాలను మాత్రం వేగంగా తొలగించి తమను రోడ్డుపాలు చేశారని, పెద్ద వ్యాపారుల విషయంలో మాత్రం అదే వేగం ఎందుకు కనిపించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. అందరికీ ఒకే నిబంధన వర్తింపజేసి, రోడ్డు విస్తరణను పూర్తి చేయాలని కోరుతున్నారు.

**చిరు వ్యాపారుల జీవనోపాధి కూడా ముఖ్యమే..**

రోడ్డు పక్కన చిన్నదుకాణాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకునే చిరు వ్యాపారుల జీవనోపాధి కూడా పట్టణ అభివృద్ధిలో భాగంగానే చూడాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ప్రజల భద్రత కోసం రహదారి విస్తరణ అవసరమైతే, మరోవైపు చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు లేదా తగిన పరిష్కారం చూపుతూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

**వినాయకుడి మాస్క్‌తో ఆర్ ఎన్ రాము వినూత్న నిరసన..**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని రోడ్డు విస్తరణ కోసం ఉద్యమిస్తున్న ఆర్ఎన్ రాము వినాయకుడి మాస్క్ ధరించి రోడ్డుపై నిలబడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ఎంతోమంది కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వివరిస్తూ, పట్టణంలో రోడ్డు విస్తరణను పూర్తి చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు, ప్రజలు రోడ్డు భద్రత విషయంలో సహకరించాలని మైకుల ద్వారా విజ్ఞప్తి చేశారు. పండుగ రోజున వినాయకుడి రూపంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ చేసిన ఈ వినూత్న కార్యక్రమం స్థానికుల దృష్టిని ఆకర్షించింది.

**వినాయకుడి పండుగలో ఒక సామాజిక సందేశం..**

వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవుడిగా భక్తులు కొలుస్తారు. అదే స్ఫూర్తితో పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలకు కారణమవుతున్న అడ్డంకులను తొలగించి ప్రజలకు సురక్షి తమైన రహదారులను అందించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం వినిపించింది. అభివృద్ధి పనులు వేగంగా పూర్తవడంతో పాటు చిరు వ్యాపారుల జీవనోపాధికి న్యాయం జరిగేలా సమతుల్యమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**రోడ్డు విస్తరణ ఎప్పుడు పూర్తవుతుంది?**

**ప్రజలకు సమాధానం ఎప్పుడు?**

రెండు నెలల క్రితం ప్రారంభమైన రహదారి విస్తరణ పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి? మిగిలిన ఆక్రమణల తొలగింపు ఎప్పుడు పూర్తవుతుంది? విస్తరణకు సంబంధించిన తదుపరి కార్యాచరణ ఏమిటి? అనే ప్రశ్నలకు మున్సిపల్ యంత్రాంగం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన రోడ్డు భద్రత అంశాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆలస్యం లేకుండా విస్తరణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

## మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలి

**మోమిన్ పేట్ ఎస్ఐ భరత్ భూషణ్**

**మోమిన్‌పేట్, సెప్టెంబర్ 15. ప్రభాతవార్త:** వినాయక చవితిని పురస్కరించుకుని మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామ ప్రజలకు భక్తులకు మోమిన్‌పేట్ ఎస్ఐ భరత్ భూషణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

"నిబంధనలు పాటిస్తూ పండుగను ఆనందంగా నిర్వహించుకోవాలి" అని ఎస్ఐ భరత్ భూషణ్ సూచించారు.

## హోటల్‌లోకి దూసుకెళ్లిన బస్సు...యువకుడు మృతి

**శంషాబాద్ సెప్టెంబరు 15,ప్రభాతవార్త :** శంషాబాద్‌లో ఓ హోటల్‌లోకి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లడంతో సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కరీంనగర్‌కు చెం దిన మొహమ్మద్ అజీదుద్దీన్ (29) మృతిచెందగా, పలువు రు గాయపడ్డారు. మొహి యుద్దీన్ తన కుటుంబ సభ్యు లతో కలిసి కారులో కరీంనగర్ నుంచి శంషాబాద్ ఆర్జీఐ విమానాశ్రయానికి వెళ్తుండగా ఉదయం 5.50 గంటల సమయంలో కింగ్స్ రెస్టారెంట్ వద్ద టీ కోసం కారు ఆపారు. అజీదుద్దీన్ టిఫిన్ కోసం కారు దిగిన సమయంలో బాచుపల్లి వైపు వెళ్తున్న సెవెన్ హిల్స్ ట్రావెల్స్ బస్సు కారును, అతడిని ఢీకొట్టింది. అనంతరం అక్కడ పార్క్ చేసిన నాలుగు వాహనాలతో పాటు బాలాజీ భవన్ హోటల్, పాన్‌షాప్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అజీదుద్దీన్‌ను సన్‌రైజ్ ఆస్ప త్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, సాదిక్ పాషా (34) తదితరులు గాయపడ్డారు. ప్రమాదంలో వాహనాలు, ఆస్తులు దెబ్బతిన్నాయి. బెంగళూరు వైపు వెళ్తున్న ఈచర్ కంటైనర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం బస్సుపై పడటం వల్లే ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదుదారు తెలిపారు.

## గణేశ్ విగ్రహం కొనుగోలుపై ఘర్షణ..ఒకరు మృతి

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వినాయక విగ్రహం కొనుగోలు విషయంలో మాటామాటా పెరిగి ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలలో ఓవ్యక్తికి తీవ్రగాయాలై మృతిచెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జోడిమెట్ల సూర్య ఆసుపత్రి ఎదురుగా వినాయక విగ్రహాల తయారీ షెడ్లు ఉండగా ఈనెల 13న రాత్రి 9 గంటలకు చౌదరి గూడకు చెందిన ఆరుగురు వ్యక్తులు గణేశ్ విగ్రహం కొను గోలు చేయడానికి వచ్చారు. విగ్రహాలు చూస్తున్న క్రమంలో రాత్రి 10:30 గంటల విగ్రహాలు అమ్మే వ్యక్తులకు వారికి ధర విషయంలో వాగ్వివాదం జరిగింది. మాటామాటా పెరిగి దూషించుకోవడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు వెదురు కర్రలతో దాడి చేసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన విగ్రహాల తయారు దారుడు చోగారామ్‌కు తీవ్రగాయాలు కావడంతో అతని కుటుంబసభ్యులు ఎదురుదాడి చేసి పసులాది కిరణ్ (34)ను వెదురు కర్రలతో చేతులతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యా యి. అతన్ని చికిత్స నిమిత్తం జోడిమెట్లలోని సూర్య హాస్పిటల్‌కు తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 1 గంటలకు మృతి చెందాడు. దీంతో చౌదరిగూడ వాసులు చేరుకొని జోడిమెట్ల వద్ద జాతీయరహదారిపై రస్తారోకో చేశారు. కిరణ్ కొట్టి చంపిన వ్యక్తులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

# భార్య సర్పంచ్... అధికారం భర్తది..

తలకొండపల్లి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు 33శాతం రిజర్వేషన్ కేటాయించాలని ఒకపక్క తీర్మానాలు చేస్తుండగా, మరోవైపు మహిళ ప్రజాప్రతినిధులపై వారి భర్తలు పెత్తనం చెలాయిస్తుండడం దుర్మార్గమని సిపిఎం పార్టీ నాయకులు మంగళవారం నాడు ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి తన గ్రామంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో తన భార్య దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డిని సర్పంచుగా గెలిపించుకున్నారు. దోకూరి సునీత పడకల్ సర్పంచిగా గెలుపొందినప్పటి నుంచి ఆమె భర్త దోకూరి ప్రభాకర్ రెడ్డి పెత్తనం చెలాయిస్తూ గ్రామపంచాయతీ పనులను సైతం అతడే నిర్వహిస్తున్నాడని, అతనికి అధికారులు సైతం వత్తాసు పలుకుతున్నారని సిపిఎం పార్టీ మండల నాయకులు దుబ్బ చెన్నయ్య, జల్లెల పెంటయ్యలు ఆరోపించారు. మంగళవారంనాడు తలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పడకల్ గ్రామంలో అనేక సంవత్సరాలుగా ఉన్న చిన్నచిన్న దుకాణాలు నిర్వహిస్తున్న నిరుపేదల డబ్బాలను జెసిబి సహాయంతో కూల్చి వేశాడని, ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్న సిపిఎం పార్టీ జెండాను సైతం జెసిబి సహాయంతో కూల్చివేసినట్లు వారు తెలిపారు. సిపిఎం పార్టీ జెండాను ఏర్పాటుచేసి 30 సంవత్సరాలు గడుస్తున్న ఎందరో సర్పంచులు తమ పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నా ఇలాంటి పనులు చేయలేదని వారు విమర్శించారు. గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రభాకర్‌రెడ్డి సొంత రాజ్యాంగాన్ని అమలుపరుస్తున్నట్లు విమర్శించారు.


మండల అధికారులకు వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

**గ్రామంలో హరితహారం**

గ్రామంలో హరితహారం పేరుతో మొక్కలు పెంచిన వాటన్నిటిని తీసివేశాడని గ్రామపంచాయతీ అధికారులను నిర్వహిస్తున్న అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గ్రామంలోని కొంత మందికి మద్యం తాగించి దాడులకు పాల్పడే విధంగా దోకూరు ప్రభాకర్ రెడ్డి ప్రోత్సహిస్తున్నాడని, వారి వివరించారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోని పక్షంలో మండల స్థాయిలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా వారు తెలియజేశారు. అనంతరం డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని ఎంపీ ఓకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల మాజీ కార్యదర్శ దుబ్బ చెన్నయ్య, పడకల్ గ్రామ శాఖ కార్యదర్శి జల్లెల పెంటయ్య, గట్టు ఇప్పలపల్లి గ్రామ కార్యదర్శి కొమ్ము చెన్నయ్య, సంగాయిపల్లి గ్రామ కార్యదర్శి నాగరాజు, నాయకులు దైవానందం కొమ్ము రమేష్ గ్రామస్తులు తదితరులున్నారు.

# రైతు పొలాలు ఎండుతున్నాయి

**కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడాలి-సామ మహేందర్‌రెడ్డి**

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15,ప్రభాతవార్త : తెలంగాణ రైతాంగం సాగు నీటి కోసం తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటోందని బిఆర్ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం కార్యదర్శి సామ మహేందర్ రెడ్డి అన్నారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో రైతుల కు ఒరిగిందేమీ లేదని, అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్న పరిస్థితులే ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసి, చెరువులు, కాలువలు, ఎత్తిపోతల పథకాలద్వారా వ్యవసాయా నికి నీరు అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సాగునీటి విస్తరణతో తెలంగాణలో వ్యవసాయ భూములు పచ్చగా మారాయని, రైతుల్లో భరోసా పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విమర్శించారు.

**కృష్ణా జలాలపై స్పష్టమైన వైఖరి ఏది?...**

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని సామ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సి న నీటి వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, నీటి విడుదల, సాగునీటి అవసరాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సి న అవసరం ఉందన్నారు. రైతులు పంటలు వేసుకున్న తర్వాత నీటి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని పేర్కొన్నారు.

**పాలమూరు-రంగారెడ్డిపై నిర్లక్ష్యంవద్దు...**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే చర్యలను ప్రభుత్వం వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని కోరారు.రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైతే వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయిన తర్వాత పరిహారం ప్రకటించడం కంటే, ముందుగానే సాగునీరు అందించి పంటలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

**రైతు పక్షాన బిఆర్ఎస్ పోరాటం....**

రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సాగునీటి పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించి అత్యవసర చర్యలు చేపట్టాలని సామ మహేందర్ రెడ్డి కోరారు. రైతుల ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.రైతు పొలం పచ్చగా ఉంటేనే తెలంగాణ పచ్చగా ఉంటుంది. రైతుకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత. రైతుల హక్కులు, తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుంది అని సామ మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఐక్యతే ఆలయ అభివృద్ధికి ప్రధాన బలం

పెద్దేముల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: గ్రామ ప్రజల ఐక్యతే ఆలయ అభివృద్ధికి ప్రధాన బలమని హనుమాన్ ఆలయ కమిటి చైర్మన్ వరప్రసాద్‌గౌడ్ అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లోమంగళవారం భజన సమాప్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వరప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు భక్తిభావన పెంపొందించుకోవాలని అన్నారు. సేవాకార్యక్రమాల్లో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపాల కృష్ణ ఆలయ కమిటి చైర్మెన్ ముదిని రాములు, డైరెక్టర్లు టి.విజయకుమార్, తలారి రాములు, సిహెచ్, నారాయన్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, భక్తులు జి,గోవ ర్ధన్‌రెడ్డి, కోమటి శ్రీనివాస్, గొబ్బురు గోపాల్, సంగెం చంద్రప్ప, హెచ్.దస్థప్ప, సంగెం శ్రీనివాస్, సంగెం వెంకటయ్య, మంగలి రాములు, సి,నర్సిములు, జె,నర్సిములు, గొబ్బురు మల్లప్ప, హర్షవర్ధన్‌రెడ్డి, కమ్మరి రాములు, కమ్మరి శ్రీనివాస్, చెవుల శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, బంటారం భీములు, మంతటి లాలప్ప, యాసని లాలప్ప, మంగలి బాలు, యాలటి పుల్లప్ప, యాలటి రాములు, బల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలి

కీసర,సెప్టెంబరు15,ప్రభాతవార్త: సెప్టెంబరు 17వ తేదిని తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలని బిజెపి కీసర డివిజన్ అధ్యక్షులు కోల బాలరాజు ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ యాదగిరిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కౌకుట్ల చంద్రారెడ్డి,సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,జిల్లా ప్రధాన కార్య దర్శులు బుద్దవరం లక్ష్మీ ,గోనే శ్రీనివాస్,జిల్లా కార్య దర్శి బోడ శ్రీనివాస్,శ్యాం సుందర్‌శర్మ,మాజీ కౌన్సి లర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ ,మాజీ అధ్యక్షులు దేశం మల్లేష్ గౌడ్,జిల్లా కార్యవర్గ సభ్యులు మెట్టు క్రిష్ణ యాదవ్,జిల్లా నాయకులు రాగుల అశోక్, ప్రభా కర్ రెడ్డి,జిల్లా కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి కొలి చెలిమి క్రిష్ణ,ఏలూరి సత్యనారాయణ, నాగారం డివిజన్ అధ్యక్షులు నాగరాజు,కీసర డివిజన్ ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్ రెడ్డి,వెంకటేశ్వర్లు, జంగారెడ్డి,నాయకులు మల్లారెడ్డి, మల్లేష్,క్రిష్ణ, రాంబాబు, భాస్కర్,లింగం, నాగరాజు,వేణు పాల్గొన్నారు.

# అన్నారంలో డ్రైనేజీ పనులకు శ్రీకారం

షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : గ్రామపంచాయతీ నిధులతో అన్నారం గ్రామంలోని 3వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ ప్రజల పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన ఈ పనులతో మురుగు నీటి సమస్యకు పరిష్కారం లభించనుందని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీఓ జయంత్ రెడ్డి హాజరై డ్రైనేజీ పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ లావణ్య రామకృష్ణ, ఉప సర్పంచ్ వి. శివశంకర్ యాదవ్, గ్రామ రెవెన్యూ సహాయకుడు రాఘవేంద్ర, 5వ వార్డు సభ్యుడు జి. పవన్ కుమార్, 2వ వార్డు సభ్యుడు జి. శ్రీశైలం యాదవ్, 4వ వార్డు సభ్యుడు ఎం. గౌరీ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి చూపు.. రంగాపూర్ సర్పంచ్ సీటుపై కన్ను

నందిగామ, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : నందిగామ మండలం రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ అనారోగ్య కారణాల రిత్యా మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే ఆమె స్థానంలో మళ్లీ ఎన్నికలు జరిగితే సర్పంచ్ గా పోటీ చేయడానికి ఆశవాహులు తమదైన శైలిలో కసరత్తులు ప్రారంభించినట్లు తెలిసింది. గత సర్పంచ్ ఎన్నికలు2025 డిసెంబర్ 11న ఎన్నికలు జరిగాయి. మొత్తము 1815 ఓటర్లు ఉండగా స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి బరిలో నిలిచిన గోవు అంజమ్మకు 855 ఓట్లు వచ్చాయి. నువ్వా నేనా రీతిలో జరిగిన ఎన్నికల బరిలో కేవలం 33 ఓట్ల మెజార్టీతో తన సమీప అభ్యర్థి ఆవుల స్వప్న జ్ఞానేశ్వర్ పై అంజమ్మ సర్పంచ్ గా గెలుపొందారు. గెలిచిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమె ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అండదండల రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు, అండర్ డ్రైనేజీలు తదితర అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం కోసం కృషి చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాల చేత సుమారు ఎనిమిది నెలల పైగా పనిచేసిన సర్పంచ్ గత నెల ఆగస్టు 29వ తేదీన పరమపదించారు. సుమారు 8 నెలలకు పైగా పనిచేసి ఆకాలంగా మృతి చెందడంతో రంగాపూర్ గ్రామపంచాయతీ ప్రజలు ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. ఏది ఏమైనా రెండు సార్లు సర్పంచ్ గా గెలిచి అర్ధాంతరంగా రంగాపూర్ సర్పంచ్ చనిపోవడం బాధాకరమని, పెద్దమ్మ లాంటి మనిషి ఎవరు వస్తారో ననే అయోమయ స్థితిలో ఉన్నారు. ఏది ఏమైనా రంగాపూర్ సర్పంచ్ గోవు అంజమ్మ మృతితో ఆ గ్రామ పంచాయతీ కుర్చీ దక్కించుకునేందుకు తగ్గేది లేదు అంటున్నారు.

**ఎస్ఐఆర్ గడువు ముగుస్తున్నందున**

# గుర్తింపు పత్రాలు ఇవ్వండి

తలకొండపల్లి సెప్టెంబరు 15, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ గడువు ముగుస్తుండడంతో నోటీసులు అందుకున్నవారు వెంటనే తమ గుర్తింపు పత్రాలు అందజేయాలని మండల అధికారులు సూచించారు. మంగళవారంనాడు తలకొండపల్లి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గ్రామసర్పంచ్ బూజూరు పుష్పమ్మ అంజన్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అధికారులు నోటీసులు ఇచ్చిన ఓటర్ దారులందరూ తమ గుర్తింపు పత్రాలను బిఎల్ఓ కు అందజేయాలని ఆమె సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గుర్తింపు పొందిన ఏదైనా గుర్తింపు పత్రాలను అందజేయాలని లేనిచో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అనం తరం రాష్ట్రప్రభుత్వం అందజేసిన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామస్తులకు రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బూజూరు పుష్పమ్మ అంజన్ రెడ్డి, రెవెన్యూ అధికారులు బిఎల్ఓ ఉపసర్పంచ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గుడి నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ చేయూత

తలకొండపల్లి, సెప్టెంబరు 15, ప్రభాతవార్త: తలకొండపల్లి మండలపరిధిలోని వెంకటాపూర్ తండా గ్రామపంచాయతీలో నూతనంగా సేవాలాల్ , మేరమ్మ యాడి గుడి నిర్మాణం కోసం గ్రామస్తులు అడగడంతో గుడినిర్మాణానికి అవసరమైన సీకులను అందజేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గుడి నిర్మాణం కోసం అవసరమైన మెటీరియల్ను గ్రామస్తులకు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.సర్పంచ్ ఎన్నికల సమయంలో తండావాసులు మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌కు గుడి నిర్మాణానికి ఆదుకోవాలని, తాండ మొత్తం ఐక్యమత్యంతో ఉంటామని హామీ ఇచ్చారు. వారికిచ్చిన మాట ప్రకారంగా మంగళవారంనాడు తమ ఇంటి సమీపంలో తండావాసులకు ఇచ్చిన మాట ప్రకారం గుడి నిర్మాణానికి అవసరమైన స్టీల్, కంకర, మెటీరియల్ను పంపిణీ చేస్తున్నట్లు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో తండా సర్పంచ్ రమేష్ నాయక్, ఉపసర్పంచ్ చందు నాయక్, వార్డు సభ్యులు హాజ, హనుమ రాము తదితరులు పాల్గొన్నారు.



## షాద్‌నగర్‌లో ప్రజా కళా జాతర కరపత్రం ఆవిష్కరణ

షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : అరుణోదయ విమలక్క 50 ఏళ్ల విప్లవ ప్రజా సాంస్కృతిక ఉద్యమ ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న ప్రజా కళా జాతరను విజయ వంతం చేయాలని పిలుపునిస్తూ షాద్‌నగర్ అమరవీరుల స్తూపం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ప్రజా, విప్లవ ఉద్యమాలు తమ సహజ క్రమంలో ఎంతోమంది కళాకారు లను సృష్టిస్తాయని, అయితే ఒకే ఆశయానికి జీవితాంతం అంకితమై ప్రజా కళా ఉద్యమానికి సేవ చేయడం అత్యంత అరుదైన విషయమని అన్నారు. చాకలి ఐలమ్మ, గద్దర్, పండుగ సాయన్న, సర్వాయి పాపన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆచార్య జయశంకర్, ఆచార్య కేశవరావు జాదవ్, కొమరం భీమ్, సమ్మక్కసారక్క, భాగ్యరెడ్డి వర్మ, అరిగే రామస్వామి తదితర మహనీయుల పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రజా కళాజాతర ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నా రు.మానవ హక్కుల వేదిక కార్యకర్త, సమాచార హక్కు రాష్ట్ర నాయకులు కె. జంగయ్య మాట్లాడుతూ ప్రజా కళాకారులు, సాంస్కృతిక యోధులు, ఆలోచనాపరులు, యువత, పౌర సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మూడు రోజుల ప్రజా కళాజాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇది వ్యక్తి పూజ కోసం నిర్వహించే కార్య క్రమం కాదని, ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల కోసం, ప్రజా కళా సాంస్కృతిక విలువల కోసం జీవితాన్ని అంకితం చేసిన కళాకారిణి, ఉద్యమానికి ఇచ్చే గౌరవమని తెలిపారు.షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన హక్కుల సంఘాల కార్యకర్తలు, ఆర్టీఐ కార్యకర్తలు, యువజనులు, వీధి వ్యాపారుల సంఘం ప్రతినిధులు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటామని తెలిపారు. స్థానిక జానపద కళారూపాలు, ప్రజా గేయాలు, సామాజిక యోధుల జీవిత గాథలను ప్రజా కళా జాతర వేదికపై ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే, ఫాతిమా షేక్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి సామాజిక విప్లవకారుల స్ఫూర్తితో పాటు ప్రజా ఉద్యమాల్లో భాగమైన సామాజిక యోధుల పోరాటాలను కళా రూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి న అవసరం ఉందని వక్తలు అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలను చైతన్యపరిచే ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతిని నిర్మించడంలో కళాకారుల పాత్ర కీలకమని తెలిపారు.మరుగున పడుతున్న జానపద కళారూపాలకు మళ్లీ జీవం పోయడం, ప్రజా కళాకారుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, కళాకారుల సంక్షేమ నిధి కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం వంటి అంశాలకు ప్రజా కళా జాతర వేదికగా నిలవాలని ఆకాంక్షి ంచారు.ప్రజా కళా జాతర మనందరి జాతర అని, ఇది కేవలం ఒక వ్యక్తిని స్మరించుకునే కార్యక్రమం కాదని, ప్రజా కళకు గౌరవం ఇచ్చే వేదికగా, ప్రజా సంస్కృతిని కాపాడే ఉద్యమంగా, కళాకారుల హక్కుల కోసం గొంతెత్తే సందర్భంగా, సామాజిక చైతన్యం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే సాంస్కృతిక పండుగగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.షాద్‌నగర్ ప్రాంత ప్రజలు, కళాకారులు, యువత, మేధావులు, పౌర సమాజ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకుడు పాండు నాయక్, ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక నాయకుడు గిరి, మానవ హక్కుల వేదిక మరియు సమాచార హక్కు రాష్ట్ర నాయకులు కె. జంగయ్య, రహమద్దీన్, న్యాయవాది బసవరాజు, ఎం.డి. గౌస్, ఫారూఖ్, రవికుమార్, జ్యోతి, శీను నాయక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**-ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి-ఆధునిక సాగు పద్ధతులను అందిపుచ్చుకోవాలి -126 మంది రైతులకు స్ప్రింక్లర్ యూనిట్ల పంపిణీ-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

మాడ్గుల ,సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:నరైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రైతులకు సాగులో పెట్టుబడి భారాన్ని తగ్గించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేం దుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చు కోవాలని రైతులకు సూచించారు.మంగళవారం మాడ్గులమండల ఎంపి డిఒ కార్యాలయంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ప్రింక్లర్ యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, రాష్ట్రపంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రాంరెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు యూనిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయంలో నీటివినియోగం అత్యంతకీలకంగా మారిందని, అందుబాటులో ఉన్ననీటిని వృథాచేయకుండా ప్రతి నీటిబొట్టును పంటకు అందించే విధంగా రైతులు సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని అన్నారు.స్ప్రింక్లర్ వంటి ఆధునిక సాగునీటి పద్ధతులు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.తక్కువనీటితో ఎక్కువవిస్తీర్ణంలో పంటలకు నీరందించడంతోపాటు నీటివృథాను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతిక విధానాలను కూడా వినియోగించుకుంటే సాగుఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు.మాడ్గుల మండలానికి 126మంది రైతులకు స్ప్రింక్లర్ యూనిట్లు మంజూరైనందుకు సంతోషం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే అర్హత కలిగిన ప్రతిరైతు ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్ప్రింక్లర్ యూనిట్లకు ప్రభుత్వం 65శాతం సబ్సిడీ అందిస్తోందని, రైతులపై ఆర్థిక భారం తగ్గించేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.రైతులు కేవలం పంటల సాగుపైనే కాకుండా నీటి పొదుపు, నేల ఆరోగ్యం, పంటల ఎంపిక, ఆధునికసాగు విధానాలపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతుకు వాటి ప్రయోజనం అందేలా ఉద్యాన శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు.రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడంలో అధికారులు ముందుండాలని, గ్రామస్థాయిలో రైతులకు పథకాల వివరాలను తెలియజేయాలని అన్నారు. వ్యవసాయరంగం అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతుల ఆదాయం పెరిగేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రైతులు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ స్ప్రింక్లర్ యూనిట్లపై ప్రభుత్వం 65 శాతం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. అర్హత కలిగిన రైతులు రూ.8,770డిడి చెల్లించిన అనంతరం నిబంధనల ప్రకారం స్ప్రింక్లర్ యూనిట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆమన్‌గల్లు మార్కెట్ కమిటీ చెర్మన్ యాట గీత నరసింహ ముదిరాజ్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కిషన్ రెడ్డి,జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేష్, ఐడీహెచ్ అరుణ, మాడ్గుల మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, సుధాకర్ కంపెనీ రాష్ట్ర సమన్వయకర్త ఉపేందర్, ఉద్యాన శాఖ అధికారి నవీన, హెచ్ఈఓ సీతారాం, నాగేష్, సుధాకర్ కంపెనీ డీసీఓ సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు,తదితరులు పాల్గొన్నారు.


స్ప్రింక్లర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

# అంగన్వాడి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కుల్కచర్ల,సెప్టంబరు 15, ప్రభాతవార్త: అంగన్వాడ విద్యార్థుకు నాణ్యమైన భోజనం అందించాలని సర్పంచ్ ఆంజిలయ్య,ఉప సర్పంచ్ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రెండవ అంగన్వాడి కేంద్రాన్ని పోషక మాసం సందర్భంగా సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం ,పౌష్టికాహారం,పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజిలయ్య మాట్లాడుతూ ..అంగన్వాడికి వచ్చే చిన్నారులకు నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనం అందించాలని సర్పంచ్ సూచించారు.చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలమకమని తెలిపారు.


అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్,ఉప సర్పంచ్

# తలనీలాల బహిరంగ వేలం

కడ్తాల్, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:మైసమ్మ దేవాలయ శివాలయ రామాలయ దేవస్థానం అమ్మవారి తలనీలాలు సేకరించు హక్కు వసూలు చేసుకునే హక్కు మంగళవారం బహిరంగ వేలాన్ని నిర్వహించారు. బహిరంగ వేలంలో 6 మంది పాల్గొనగా జద్పర్ల గ్రామానికి చెందిన వజ్రగిరి రామయ్య 2,56,000/( రెండు లక్షల యాభై ఆరు వేలు) రూపాయలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రణీత్, ఆలయ పౌదర్ ట్రస్టు చైర్మన్ లక్ష్మీ మ్మ శిరోలి, ఈఓ మఠం వీరేశం, ఉప ప్రధాన అర్చకులు మాదారం యాదగిరి, సిబ్బంది పి.కృష్ణ, బి.చంద్రయ్య, జి.రాములు, ఏ.శ్రీనివాసులు, పత్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు.


బహిరంగ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

## గిరిజన రిజర్వేషన్ల 10శాతం సాధించి సెప్టెంబర్ 17కి నాలుగేళ్లు

షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అధ్యక్షతన షాద్‌నగర్ నియోజకవర్గ గిరిజన నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ గిరిజన సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, గిరిజన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో గిరిజనుల జనాభా ప్రాతిపదికన 6 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని అన్నారు. 2022 సెప్టెంబర్ 17న 10 శాతం రిజర్వేషన్లపై నిర్ణయం ప్రకటించబడిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నెల 17వ తేదీకి గిరిజన రిజర్వేషన్ల పెంపు నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని తండాల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేయాలని గిరిజన నాయకులు, కార్యకర్తలకు అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?**

2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు అనేక హామీలు ఇచ్చిందని అంజయ్య యాదవ్ అన్నారు. పోడు భూములపై అర్హులైన గిరిజనులందరికీ హక్కులు కల్పించి పట్టాలు ఇస్తామని ,మూడు గిరిజన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ఒక్కో కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్ల చొప్పున నిధులు కేటాయిస్తామని , ప్రతి మండలంలో గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరి ఆ మూడు గిరిజన కార్పొరేషన్లు ఎక్కడ? ఒక్కో కార్పొరేషన్‌కు సంవత్సరానికి రూ.500 కోట్లు కేటాయిస్తామన్న హామీ ఏమైంది? ఒక్క రూపాయి అయినా కేటాయించారా? ప్రతి మండలంలో గిరిజన పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పిన మాట ఏమైంది? అని అంజయ్య యాదవ్ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గిరిజనులను ఆకట్టుకునేందుకు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను మోసం చేస్తోందని ఆయన విమర్శించారు. గిరిజనుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై గ్రామాలు, తండాల్లో ప్రజలకు వివరించాలని గిరిజన నాయకులకు అంజయ్య యాదవ్ సూచించారు. గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని ప్రతి తండా నుంచి గిరిజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, గిరిజన నాయకులు మిట్టు నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజు నాయక్, గోపాల్ నాయక్, హన్య నాయక్, అమ్రు నాయక్, రవి నాయక్, రాం చరణ్, లక్ష్మణ్, దశరథ్, హరి నాయక్, లచ్చు నాయక్, కిషన్ నాయక్ తదితరులు, నియోజకవర్గ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ గిరిజన శ్రేణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్


నిమజ్జనం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

# భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం పూర్తి చేసుకోండి

షాద్‌నగర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త : గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ గణేష్ మండలి నిర్వాహకులకు పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణంలోని బొబ్బిలి చెరువు వద్ద గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, పోలీస్ శాఖ ఎస్ఐలు, విద్యుత్ శాఖ ఏఈ వినోద్ తదితర అధికారుల బృందం పరిశీలించింది. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లను వారు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో గణేష్ వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు చెరువులను ఎంపిక చేసినట్లు తెలిపారు. బొబ్బిలి చెరువువద్ద పెద్దసంఖ్యలో గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున మున్సిపల్ సిబ్బందితోపాటు ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధం, మౌలిక వసతులు, విద్యుత్ తదితర అవసరమైన ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేపడుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరికొన్ని చెరువులను కూడా నిమజ్జనానికి అనువుగా సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. గణేష్ మండలి నిర్వాహకులు అధికారులు సూచించిన నిబంధనలను పాటిస్తూ పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలని చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్ కోరారు.

# ఎన్నికల హామీలు అమలు చేయకపోతే గిరిజనుల ఆగ్రహం తప్పదు: బాల్‌రాజ్ నాయక్

ధారూర్, సెప్టెంబరు 15, ప్రభాత వార్త: అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డి కె తండాకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బాల్‌రాజ్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల వేళ గిరిజన సంక్షేమం కోసం ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన గత ప్రభుత్వం పెంపుదల చేసిన పది శాతం రిజర్వేషన్లను ప్రస్తుత ప్రభుత్వం ఏ ఒక్క శాఖలోనూ అమలు చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.

గిరిజనుల జనాభా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా సబ్‌ప్లాన్ చట్టానికి చట్టబద్ధత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, మూడేళ్లు గడుస్తున్నా దీనిపై నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు. తక్షణమే గిరిజన అభ్యర్థుల కోసం గుర్తించిన ప్రభుత్వ ఉద్యోగ బ్యాక్‌లాగ్ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 20న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలు

జవహర్ నగర్,సెప్టెంబరు,15 ప్రభాత వార్త: మేడ్చల్ జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపిక పోటీలు ఈ నెల 20న ఉదయం 7 గంటలకు హకీంపేటలోని తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో నిర్వహించనున్నట్లు నిర్వహించనున్నట్లు నిర్వాహక కార్యదర్శులు బి.ఈ.స్టాన్లీ జోన్స్, కురపాటి రాజశేఖర్ తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26,27 తేదీల్లో హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మేడ్చల్‌జిల్లా తరపున పాల్గొంటారని పేర్కొన్నారు.అండర్-14 విభాగంలో ట్రయాథ్లాన్ ఏ,బీ,సీ, అండర్-16 విభాగంలో 60మీటర్లు,600 మీటర్లు,షాట్‌పుట్,జావెలిన్ త్రో,అండర్-18 విభాగంలో 100,200,400,800,1500,3000 మీటర్ల పరుగు,లాంగ్‌జంప్,హైజంప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-20 విభాగంలో100,200,400,800,1500,3000 మీటర్ల పరుగు,లాంగ్ జంప్,హై జంప్,ట్రిపుల్‌జంప్ విభాగాల్లో పురుషులు, మహిళలకు పోటీలు,ఎంపికలు ఉంటాయని వెల్లడించారు.ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 20న ఉదయం 7గంటలకు తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాల,హకీంపేటలో నిర్వాహక కార్యదర్శి కురపాటి రాజశేఖర్ వద్ద రిపోర్టు చేయాలని వారు సూచించారు.


ఆమనగల్లు శివాలయంలోని శివశక్తి యూత్ ఆధ్వర్యంలో...


గణనాథుని వద్ద పోలీస్ అధికారులు


మట్టి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సర్పంచ్


ఆమనగల్లు సాయిమందిరంలో మట్టిగణపతికి పూజలు చేస్తున్న భక్తులు


ఆమనగల్లు ఆధ్వర్యంలో పూజలు అందుకుంటున్న గణనాథుడు


నిమజ్జన కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ పత్యానాయక్, కమీషనర్ రాఘవేందర్‌రెడ్డి


వినాయకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


మోమిన్‌పేట్ : గల్లి గల్లిలో మొదటి రోజు పూజలందుకున్న గణనాథుడు.


వినాయకుడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి


వినాయకుడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి.


ఘట్‌కేసర్‌లో ఆర్‌కే శివాజీ యూత్ గణేశుని పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, డిసిసి అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్


నగరేశ్వర దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు.

# వాడవాడలా లంబోదరునికి జేజేలు

**గణనాథుని సన్నిధిలో ప్రత్యేక పూజలు**

**మాడ్గుల ,సెప్టెంబర్ 15 ప్రభాతవార్త:** మండలంలోని ఆర్కపల్లి గ్రామంలోని కాశీ విశ్వేశ్వర వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ఆర్కపల్లి గ్రామ సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మాడ్గుల సీఐ వేణుగోపాల్, ఎస్సై రాఘవేంద్ర గౌడ్ హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని గ్రామప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండా లని ప్రార్థించారు. పూజా కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

**మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం**

**మాడ్గుల, సెప్టెంబర్ 15, ప్రభాతవార్త:–** వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ కోరుకోరు తిరుపతయ్య,సోదరుడు కోరుకోరు లక్ష్మీనారా యణతో కలిసి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని మూడు వినాయక మండపాల కమిటీ సభ్యులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతయ్య మాట్లాడుతూ వినాయకచవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వల్ల మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు చెరువులు, కుంటలు, ఇతర నీటివనరులను కాలుష్యం నుంచి రక్షించవచ్చని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాలు నీటిలో త్వరగా కరగకపోవడంతో నీటి వనరులకు నష్టం కలిగే అవకాశం ఉందని, అందువల్ల పర్యావరణ హితమైన మట్టివిగ్రహాలనే వినియోగించాలని సూచించారు. ప్రకృతినిపరిరక్షించడం ప్రతి ఒక్కరిబాధ్యత అని, చిన్నచిన్న మార్పులతో పర్యావరణానికి ఎంతో మేలు చేయవచ్చని పేర్కొన్నారు. గ్రామంలోని మూడు వినాయక కమిటీలకు ఉచితంగా మట్టి విగ్రహాలను అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తమ ఉద్దేశ్యమన్నారు. గ్రామప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకొని మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని కోరారు.

**శోభాయమానంగా దర్శనమిస్తున్న గణనాథుడు**

**ఆమనగల్లు, సెప్టెంబరు15, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం ప్రజలు వినాయకచవితి పర్వదినాన్ని ప్రజలు కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సవాల మధ్య అత్యంతవైభవంగా జరుపు కున్నారు. నివాసాలతోపాటు కాలనీలు, వీధులు, గ్రామాల ముఖ్యకూడలీలో గణనాథుల ప్రతిమలను ప్రతిష్టించి పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాలను అంగరంగవైభవంగా ప్రారం భించారు. ఉత్సవాల సందర్బంగా గణనాథుని పాటలతో వీధులన్నీ ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకున్నాయి. చవితి సందర్బంగా ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌరస్తా, గాంధీచౌక్, షాద్‌నగర్‌రోడ్డు, కూరగాయల బజార్ వంటి ప్రధాన కేంద్రాలు వచ్చిపోయే వారితో క్రిక్కరిసిపోయింది. ఉత్సవాలను ఆకర్షించేందుకు వినాయకమండపాలను అందంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాల వెలుగులో మండ పాలు జిగేలుమంటూ శోభాయమానంగా దర్శనమిస్తు న్నాయి. పోటాపోటీగా మండపాలను అలంకరిస్తున్నారు.

**నిమజ్జన కేంద్రం పరిశీలన**

**ఆమనగల్లు, సెప్టెంబరు15, ప్రభాతవార్త:** గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో జరిగే నిమజ్జన ఏర్పాట్లను స్థానిక మున్సిపాలిటీ వేగవంతం చేసింది. మంగళవారం కమీషనర్ రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ పత్యానాయక్, ఎస్సై సంతోష్‌రెడ్డితోపాటు ఇతర అధికారులు మంగళవారం సుర సముద్రం చెరువును సందర్శించి నిమజ్జనపాయింట్‌ను ఎంపిక చేశారు. చెరువుకట్టపై ఏపుగా పెరిగిన ముళ్ళపొదలను గుర్తించి వాటి తొలగింపుచర్యలు తీసుకోవాలని సూచించారు. ఈమేరకు ఆరోజు తీసుకోవలసిన జాగ్రత్తలు, తరలివచ్చే విగ్ర హాల సంఖ్య, సిబ్బంది ఆవశ్యకత, అవసరాల గురించి సల హాలు అందించారు. అలాగే నీటిసామర్థ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు, ఏర్పాట్లను సమకూర్చాలని ఆయన మున్సిపాలిటీ కమీషనర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మొక్తాల వెంకటయ్య, నాగిళ్ళ జగన్, అనూషశ్రీశైలం, ఎర్రవోలు మహేశ్, దోళిమల్యానాయక్, ఉత్సవ సమితి సభ్యులు గుండ్రాతి కుమార్‌గౌడ్, సురేష్‌నాయక్, పూసలి సత్యం, గణేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

**గణనాథుని ఆశీస్సులతో**
**ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే**

**పెద్దేముల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం గణణాథులు కొలువుదీరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి ఆశీస్సు లతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గణనాథుడి ఆశీస్సులతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలజీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్, యండి రియాజ్, పెద్దేముల్ గ్రామకమిటి అధ్యక్షులు సాయులు, కోహీర్ రవిశంకర్, మాజీ యంపిటిసి విద్యాసాగర్, చిట్టెపు శ్రీకాంత్‌రెడ్డి, డివై నర్సిములు, ఆనందచారి, ఎర్రరవి, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగ వినాయక చవితి పండుగ**

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంతో పాటు మండలం లోని అన్ని గ్రామాలలో సోమవారం వినాయక చవితి పండుగను ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలలో గణనాథులకు ప్రతి ష్ఠాపన చేశారు. ప్రతిష్ఠించిన వినాయకుల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో వర్షాలు బాగ కురిసి ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండే విదంగ చూడాలని గణపతిని వేడుకున్నారు. ఇదిలావుంటే మండలంలోని ఫీర్జాపూర్ గ్రామంలో ఇరువర్గాల వారు గొడవలు పెట్టుకుని పూజలు చేయకుండానే వినాయకుని నిమ్మజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

**గల్లి గల్లిలో కొలువు దీరిన గణనాథుడు**

**మోమిన్‌పేట్, సెప్టెంబర్ 15. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం గల్లి గల్లిలో అంగరంగ వైభవంగా కొలువు దీరిన గణనాథుడు. ఉదయం సాయంత్రం నిష్టగా పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు 5,7,9 రోజులు పూజలందుకొని నిమజ్జనానికి ఆటాపాటలతో బయలు దేరుతాడు. ఒక్కో మండపాన్ని చూడముచ్చటగా రంగు రంగుల వీధి దీపాలతో పచ్చని తోరణాలు కట్టి తయారు చేశారు. మండపాలవద్ద భక్తులు రాత్రంతా భజనలు చేస్తు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**వాడవాడలా కొలువుదీరిన గణపయ్యలు**

**తాండూరు, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** తాండూరులో వినాయక చవితి ఉత్సవాలు భక్తి శ్రద్దలతో అట్టహసంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తాండూరు పట్టణంలోని వివిద వార్డులలో ఏర్పాటు చేసిన మండపా లలో మహ గణపయ్య కొలువుదీరాడు. పట్టణంలోని వినాయకచౌక్, నగరేశ్వర దేవాలయం, గాంధీచౌక్, భద్రేశ్వరచౌక్, పాతతాండూరు, బస్వణ్ణకట్ట, గాంధీనగర్, సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి తదితర ప్రాంతాలలో భారీ ఏర్పాట్లతో వినాయకులను ప్రతిష్టించారు. మరోవైపు పట్ట ణంలో కొలువుదీరిన గణపయ్యలకు తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు వేరువేరుగా పలు మండపాల్లో ఏర్పాటు చేసిన గణపయ్యలను దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వ హించారు. పట్టణంలోని భద్రేశ్వరచౌక్‌లో భద్రేశ్వర వినాయక ఉత్సవసమితి సభ్యులు ప్రతిష్టించిన గణనాథునికి మహేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాంపేట్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన గణపయ్యలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తాండూరు లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని నెహ్రూగంజ్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద తొలిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతు గణేష్ ఉత్సవాలను పట్టణ ప్రజలు శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని సూచించారు. కులమతాలకతీతంగా ఉత్సవ వేడుకలను జరుపుకోవాలన్నారు.

**నగరేశ్వర దేవాలయ వినాయకునికి 50 ఏళ్లు**

తాండూరు పట్టణంలో ప్రసిద్ది చెందిన నగరేశ్వర దేవాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న వినాయక ప్రతిష్టాపన వేడకలకు యబైఏళ్లు పూర్తయ్యాయి. గత యాబై ఏళ్లుగా నిర్వాహకులు దేవాలయం వద్ద వినాయకున్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. తాండూరు పట్ట ణంలోని నెహ్రూగంజ్ ఆవరణలో మొదటిసారిగా వినాయకు న్ని ప్రతిష్టించగా.. గత యాబైఏళ్ల క్రితం 1976 సంవత్సరంలో రెండో వినాయకున్ని నగరేశ్వర దేవాలయం వద్ద ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం 50 ఏళ్లు పూర్తి కావడంతో వినాయక మండపం వద్ద నిర్వాకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకలను మరింత వైభవంగా నిర్వహిస్తున్నారు.

**సూర్య యూత్ గణపతికి మల్లారెడ్డి పూజ**

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ 8 పరిధి అన్నోజిగూడలో ఎమ్మెల్యే మల్లారెడ్డి వినాయకపూజ చేశారు. సూర్యయూత్ అధ్యక్షులు బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సూర్యయూత్ 30వ వార్షికోత్సవ గణపతి పూజ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డి విచ్చేసి గణనాధునికి పూజలు చేశారు. విగ్రహ దాత అల్వాల గౌరీష్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుంటున్న సూర్య యూత్‌సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**గణపయ్యకు పూజలు**

**మేడ్చల్, సెప్టెంబరు 15. ప్రభాతవార్త ః** మేడ్చల్‌లో వాడవాడలా వినాయకులను నెలకొల్పడంతో ఉత్సహ భరితంగా మారింది. ఏ కాలనీలో చూసినా గణనాథుల మండపాలతో కోలాహలంగా మారింది. వినాయక చవితి రోజు యువజన సంఘాలు, యువకులు, కాలనీల వాసులు, ప్రజలు వినాయకులను నెలకొల్పి కొలుచుకున్నారు. మేడ్చల్ పట్టణంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి పట్టణ కాంగ్రెస్ నేత రామన్నగారి రాఘవేందర్ గౌడ్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్‌రావు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**స్వామిసేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి**

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలో వినాయకచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్దలతో జరుపుకున్నారు. వివిధ ఆకృతులతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన మండపాలలో విఘ్నేశ్వరస్వామిని అర్చకుల మంత్రోచ్ఛారణాల మధ్య ప్రతిష్టించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘట్‌కేసర్ పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని మండపంలో ఆర్‌కే శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన భారీ గణపతికి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు విచ్చేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి యేటా వినాయకచవితికి ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇక్కడికి వచ్చి విఘ్నేశ్వరునికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం ఎస్ఆర్ యూత్, లాల్‌బహుదూర్ యూత్‌ల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాధునికి ఎమ్మెల్యే పూజచేయగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాసుగౌడ్, మాజీ మేయర్ జక్కా వెం కట్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్లు పలుగుల మాధవ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

**విఘ్నేషా ఎలినీవో ప్రభావం నుండి కాపాడు**

**నందిగామ, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** నందిగామ మండలంలో ఆయా గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. నందిగామ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద సర్పంచ్ కొమ్ము కృష్ణ , ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలినీవో ప్రభావంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వర్షాలు సమృద్ధిగా కురిపించి, సంపూర్ణ ఆరోగ్యం, అష్టైశ్వర్యాలు కల్పించేలా దీవించాలని వేడుకున్నారు. సిడితండాలో వినాయకుని పూజలో సర్పంచ్ గబ్రు చౌహాన్ అన్న ప్రసాద వితరణ చేశారు. నందిగామ భజన కోటలో జనసేవ యూత్ అసోసియేషన్ నేత ఆర్ రంజిత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు చేశారు. నందిగామ అంబేద్కర్ కాలనీలో జై భీమ్ అసోసియేషన్ నేత కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నందిగామ శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో ఉత్తమ రైతు అవార్డు గ్రహీత జిల్లెల్ల బాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. అంతిరెడ్డిగూడెం సర్పంచ్ గడ్డల మంజుల యాదగిరి వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు, ఈ కార్యక్రమంలో నందిగామ మాజీ సర్పంచ్ వంకాయల రామన్న, బిఆర్ఎస్ నేతలు జిల్లెల్ల జనార్దన్ రెడ్డి, దామోదర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**వాడవాడల్లో కొలువుదీరిన గణనాథులు**

**కొడంగల్, సెప్టెంబరు15, ప్రభాతవార్త:** సకల విఘ్నాలను తొలగిస్తూ సుఖసంతోషాలతో పాటు అష్టఐశ్వర్యాలను కలిగించాలని కోరుతు భక్తులు వినాయకుల ప్రతిష్టాపనతో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలం కరించిన మంటపాల్లో వివిధ వినాయక ఉత్సహ కమిటీల అద్వర్యంలో గణనాధుల ప్రతిష్టాపనతో ప్రత్యేక పూజలు చేస్తు భక్తిశ్రద్దలతో భజన కార్యక్రమాలు చేపట్టారు. కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తా, వడ్డర్‌గల్లీ ,లాహోటి కాలనీ, శాంతినగర్, కార్గిల్‌కాలనీ, ఇంద్రనగర్, కలాల్‌వాడీ ,తెలంగ్‌వాడీ, బసవణ్ణ కట్ట, బాలాజీనగర్, ఆర్యనగర్, జులైవాడ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో వినాయకుల విగ్రహలు కొలువుదీరాయి. అలాగే మండలం లోని వివిధ గ్రామాల్లో వినాయకులను ఘనంగా మంటపాల్లో ప్రతిష్టాపన చేశారు. ఈ సందర్భంగా గణనాథులకు మొదటిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో దాదాపు 150కి పైగా విగ్రహాలను ప్రతిష్టించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్టించిన గణనాధులకు 11 రోజుల పాటు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తు నిమజ్జనానికి సిద్దం చేస్తారు

**కొడంగల్ మండల పరిధిలో ...**

వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని హస్నాబాద్, పర్సాపూర్, రావులపల్లి, పెద్దనందిగామ, చిన్న నందిగామ, ఊడిమేశ్వరం, అప్పాయిపల్లి, అంగడ రాయిచూర్, టేకుల్‌కోడ్, రుద్రారం ,అన్నారం, నాగారం, చిట్లపల్లి, గుండ్లకుంట ,హుస్సేన్‌పూర్ తదితర గ్రామాల్లో ప్రజలు వినాయకులను ప్రతిష్టించారు. కొడంగల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రతిష్టించిన వినాయకుడికి మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**వినాయక శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదు**

**పెద్దేముల్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వినాయక శోభయాత్రలో డీజేలకు అనుమతిలేదని పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు. వినాయక చవితి పండుగ సందర్భంగా నిర్వహించే వినాయక శోభాయాత్ర (నిమజ్జనం) సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుచర్యల్లో భాగంగా మండలం లోని 14 మంది డీజే ఆపరేటర్లను తహ సిల్దార్ వెంకటేష్ ప్రసాద్ ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్బంగా ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ మాట్లాడుతూ ప్రతి డీజే ఆపరేటర్‌కు రూ, 2 లక్షల పూచికత్తుతో వ్యక్తగత బాండ్‌పై బైండోవర్ చేయడం జరిగిందని అన్నారు.

**ఘనంగా గణపతి ప్రతిష్ట పూజలు**

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధునికి మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ పూజలు చేశారు. నేతాజీ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు ఆయన విచ్చేసి గణనాధున్ని దర్శించుకొని ప్రతిష్ట పూజలో పాల్గొన్నారు. ఈసందర్భంగా విచ్చేసిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.


పెద్దేముల్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే


మంబాపూర్‌లో పూజలు నిర్వహిస్తున్న చైర్మన్


అన్నోజీగూడలో వినాయకపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


వినాయకుడిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్ గౌడ్


నందిగామలో వినాయక పూజలో పాల్గొన్న సర్పంచ్ తదితరులు.


కొడంగల్‌లో వినాయకునికి పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్




## ఘట్‌కేసర్‌లో అప్‌డేటింగ్ ప్యార్ సినిమా విడుదల

**ఘట్ కేసర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘట్‌కేసర్ పాత గ్రామ పంచాయతీ ఆవరణంలో "అప్ డేటింగ్ ప్యార్" చిత్రాన్ని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి యూట్యూబ్‌లో అధికారికంగా విడుదల చేశారు. నేటితరం యువతలో మారుతున్న ప్రేమ సంబంధాలు, సహజీవనం, పెళ్లికి ముందే గర్భం దాల్చినప్పుడు ఎదురయ్యే సమస్యలు, కుటుంబ ఒత్తిడి, సమాజపు చూపు, మానసిక సంఘర్షణలు వంటి సున్నితమైన అంశాలను ఆధారంగా చేసుకుని తెరకెక్కించిన వాస్తవ సంఘటనల స్ఫూర్తితో రూపొందిన చిత్రం "అప్ డేటింగ్ ప్యార్." అని నిర్వాహకులు తెలిపారు. కళల బంధుడు యూట్యూబ్ ద్వారా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. వినాయకచవితి పర్వదినాన శాసనసభ్యుల చేతుల మీదుగా సినిమా అధికారిక విడుదల చేయడం విశేషం. యువత, కుటుంబ సంబంధాలు, సమాజం మధ్య నేటి పరిస్థితులను ప్రతిబింబించే ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరు కళల బంధుడు యూట్యూబ్ లో వీక్షించి ఆదరించాలని చిత్ర బృందం కోరింది. ఈకార్యక్రమంలో చిత్ర దర్శకుడు షేను భానుచందర్, హీరో మహేష్, హీరోయిన్ సుష్మిత గిరిధారి, డిసిసి అధ్యక్షులు వజ్రేశ్ యాదవ్, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపిటీసి మేకల నర్సింగ్‌రావు తదితర నాయకులు, చిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

**కేశంపేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో సర్వే నంబర్ 216లో ఉన్న 5 ఎకరాల 15 గుంటల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై నిర్మాణాలు చేపట్టారని గ్రామ సర్పంచ్ బిసా కవిత కరుణాకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించి, ఆక్రమణకు గురైన భూమిని తిరిగి గ్రామ పంచాయతీకి అప్పగించి గ్రామ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. ఈ మేరకు సర్పంచ్ బిసా కవిత కరుణాకర్ రెడ్డి డిప్యూటీ తహసీల్దార్ గీత, స్థానిక ఎస్సైకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు, ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి ,ఉప సర్పంచ్ రవి నాయక్ , వార్డు మెంబర్స్ పోగుల నరసింహులు, నరేష్, ప్రేమలత, సంతోష, కాంగ్రెస్ నాయకులు చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, గుత్తి శేఖర్, పెద్దపల్లి నరసింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, సుజీవరెడ్డి, శంభుల శేఖర్, సుమన్ రెడ్డి, కందన శివయ్య, నాగిళ్ల యాదయ్య, అంతారం ఆంజనేయులు, నాగిళ్ల చందు ,నర్సింలు, యాదయ్య ,చంద్రయ్య, అంజి, మల్లయ్య, అంజయ్య ,తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్ గీతకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ బీసా కవితా కరుణాకర్ రెడ్డి ,తదితరులు

**మూడుచింతలపల్లి మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ యాదగిరి అనారోగ్యంతో మృతి**

**శామీర్‌పేట, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ ఎడుముళ్ల యాదగిరి (అద్రాస్‌పల్లి) అనారోగ్యంతో ఉండి మృతిచెందటంతో ఆ మున్సిపల్ చైర్మన్ జాము రవి ప్రగాఢ సంతాపం తెలియజేసి, బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపి రూ.21వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ కూడ పాల్గొని ప్రగాఢ సంతాపం తెలిపి బాధిత కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని అద్రాస్‌పల్లి గ్రామంలో ఆయన నివాసంకు వెళ్లి పార్థీవదేహంకు పూలమాల చైర్మన్ జాము రవి సంతాపం తెలియజేశారు. దీనిలో ఆయనతో పాటు కమిషనర్, కౌన్సిలర్లు, స్థానికులు అంత్య క్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్ యాదగిరి మృతి బాధాకరమన్నారు. విధి నిర్వాహణలో తన సేవలను బాగా అందించారని అన్నారు, బాధిత కుటుంబానికి, మున్సిపల్ సిబ్బందికి అండగా ఉంటామని చైర్మన్ జాము రవి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా ఉంటా

**షాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** రేడియల్ రోడ్డు కూడలి ఏర్పాటులో సంకేపల్లిగూడ, శేరిగూడ, మల్లారెడ్డిగూడ రైతుభూములు, ఇండ్లు పోతున్నాయని, ప్రభుత్వం రైతులకు, గ్రామస్తులకు నష్టం కలగకుండా చూడాలని చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం సంకేపల్లిగూడ వద్ద రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నాడు. ఈ సందర్బంగా స్థానిక ఎమ్మెల్యే కాలెయాదయ్యతో ఫోన్లో మాట్లాడారు. సంకేపల్లిగూడలో రేడియల్ రోడ్డు కూడలి గురించి ఎమ్మెల్యేను అడిగితే నాకేంతెలియదు. అంత అధికారులు చూసుకుంటున్నారని తెలిపాడు. ఇది సెంట్రల్ గవర్నమెంట్ పని అని ఎమ్మెల్యే అన్నాడు. ఈ రోడ్డు సెంట్రల్ గవర్నమెంట్ పని కాదు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని నీకు తెలియదా.. తెలుసుకో అని ఎంపి అన్నాడు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ఒక కాలు బీఆర్ఎస్ లో ఒక కాలు కాంగ్రెస్లో ఉందని అన్నాడు. రేడియల్ రోడ్డు కూడలిలో కల్వకుంట్ల ఫ్యామిలికి చెందిన భూమి ఉన్నందున అక్కడ భూమి పోకుండా సామాన్య రైతుల భూములు పోవడంపై కల్వకుంట్ల కుటుంబం, కాంగ్రెస్ రెండు కలిసిపోయాయ అని ప్రశ్నించాడు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య, రైతులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌కు సన్మానం

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు–ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మేడ్చల్ డిసిసి అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ సన్మానించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా మహేశ్‌కుమార్‌గౌడ్ రెండు సంవత్స రాల పదవి కాలం పూర్తి చేసుకున్న సందర్బంగా మంగళవారం గాంధీభవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా మహేశ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఆయన నాయకత్వంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యిందని వారు పేర్కొన్నారు.

## స్కూటీ ర్యాలీలో మేడ్చల్ బిజెపి మహిళా నేతలు

**మేడ్చల్, సెప్టెంబరు 15. ప్రభాతవార్త ః** ఈ నెల 17న నిర్వహించనున్న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నగరంలో బీజేపీ మహిళా మోర్చా విభాగం ఆధ్వర్యంలో భారీ స్కూటీ ర్యాలీ నిర్వహించారు. చార్మినార్ నుండి అసెంబ్లీ సమీపంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీకి మేడ్చల్ బీజేపీ మహిళా నేతలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్, ఎల్లంపేట మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు పుష్పలత, మహిళా నాయకులు అనిత, సంధ్య, సుజాత, లావణ్య, సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ, సెప్టెంబర్ 17వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలను, అలాగే పేరడ్ గ్రౌండ్ నిర్వహించే కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**మొయినాబాద్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, మొయినాబాద్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు మద్యపాగు మహేష్, ముదిగొండ ప్రభాకర్ యాదవ్ లు అన్నారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా మొయినాబాద్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు మద్యపాగు మహేష్, ముదిగొండ ప్రభాకర్ యాదవ్ లు హాజరై విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. విద్యార్థుల్లో సమానత్వ భావన పెంపొందించడంతో పాటు పాఠశాల వాతావరణంలో క్రమశిక్షణకు పాఠశాల యూనిఫాంలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఉపాధ్యాయులు బోధించే పాటలపై విద్యార్థుల ప్రత్యేక దృష్టి సారించి, మంచి ఫలితాలను సాధించాలని వారు ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు వారి విద్యాభివృద్ధికి తాము సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.